https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే సారథ్యంలో

చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 18 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ బుధవారం,అక్టోబర్,14, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

ఆసుపత్రిలో ధరల పట్టిక ఉండాల్సిందే..

న్యూఢిల్లీ,అక్టోబర్,13:దేశంలో ఆరోగ్య సంరక్షణ సేవల్లో పారదర్శకత, జవాబుదారీతనాన్ని పెంపొందించే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రులు, క్లినిక్‌లు తదితరాలు తమ వద్ద అందుబాటులో ఉన్న వివిధ వైద్య సేవలు, పడకల రుసుము, టెస్ట్‌ల ధరల పట్టికను రోగులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను ఆదేశించింది. ఈ మేరకు కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి పుణ్యసలిల శ్రీవాస్తవ అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలకు లేఖ రాశారు. క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) చట్టం కింద నిర్దేశించిన నిబంధనలను కఠినంగా అమలు చేయాలని చెప్పారు. తద్వారా రోగులకు ముందస్తుగానే వ్యయ సమాచారం అందుబాటులో ఉంటుందని స్పష్టం చేశారు. కేంద్ర ఆదేశాల ప్రకారం, ప్రతి వైద్య కేంద్రం తమ రిసెప్షన్



లేదా ఆవరణలోని ప్రముఖ ప్రదేశాలలో స్థానిక భాషతో పాటు ఆంగ్లంలో కూడా వివిధ సేవల రుసుముల వివరాలను ప్రదర్శించాలి. ఓపీడీ ఫీజు, ఐసీయూ పడకల ధరలు, డయాగ్నోస్టిక్ పరీక్షలు, ప్రధాన శస్త్రచికిత్సల అంచనా వ్యయాల జాబితాను స్పష్టంగా ఉంచాలి. చికిత్స ముగిసాక అదనపు లేదా అస్పష్ట రుసుములతో రోగుల కుటుంబాలపై ఆర్థిక భారం పడకుండా చూడటమే ఈ చర్య ప్రధాన లక్ష్యం.

సౌదీనే వణికిస్తున్న హౌతీలు..?

ఒకప్పుడు యెమెన్‌లోని పర్వత ప్రాంతాలకే పరిమితమైన తిరుగుబాటు బృందం.. ఇప్పుడు సౌదీ అరేబియా రాజధాని రియాద్ వరకు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసే స్థాయికి ఎదిగింది. విమానాశ్రయాలు, చమురు కేంద్రాలే లక్ష్యంగా విరుచుకుపడుతున్న హౌతీలను అడ్డుకోవడం సౌదీ రక్షణ వ్యవస్థకూ సవాలుగా మారింది. అత్యాధునిక ఆయుధాలు ఉన్న దేశాలకే వీరిని నిలువరించడం ఎందుకు కష్టమవుతోంది?. ఇంతకీ హౌతీలకు ఈ శక్తి ఎక్కడి నుంచి వచ్చింది?.. హౌతీ రెబల్స్ తొలుత యెమెన్‌లో పుట్టుకొచ్చిన రాజకీయ, సైనిక, మత ఉద్యమం.

వీరు తమను తాము ‘అన్సార్ అల్లా’గా పిలుచుకుంటారు. 1990లలో ఉత్తర యెమెన్‌లో జైదీ షియా మత సంప్రదాయ పునరుజ్జీవన ఉద్యమంగా మొదలైన ఈ సంస్థ.. క్రమంగా సాయుధ శక్తిగా మారింది.

2011లో అరబ్ వసంతం నిరసనలతో యెమెన్‌లో రాజకీయ సంక్షోభం ఏర్పడిన తర్వాత ఉత్తర ప్రాంతాల్లో తమ పట్టును పెంచుకుంది. 2014లో



రాజధాని సనాను స్వాధీనం చేసుకుని, అంతర్జాతీయ గుర్తింపు పొందిన ప్రభుత్వాన్ని వెనక్కి నెట్టింది. 2015లో హౌతీలను ఓడించి యెమెన్ ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకురావాలనే లక్ష్యంతో సౌదీ నేతృత్వంలోని సంకీర్ణ దళాలు యుద్ధంలోకి దిగాయి.

అధికారం అజమాయిషీకి కాదు..

ప్రజలకు సాధికారత కల్పించాలి

భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు : మోదీ

న్యూఢిల్లీ,అక్టోబర్,13:టెక్నాలజీ, డేటా, నాలెడ్జ్, ఇన్నోవేషన్ అనేవి నేటి ప్రపంచంలో అత్యంత కీలక శక్తులని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వాటిని కొందరి ప్రయోజనాలకే పరిమితం చేయకుండా.. కోట్లాది మందికి కొత్త అవకాశాలు కల్పించేందుకు ఉపయోగించాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం బ్లూమ్‌బర్గ్ న్యూ ఎకానమీ ఫోరమ్‌లో మాట్లాడిన ఆయన.. పోటీకి బదులుగా సహకారం, నియంత్రణకు బదులుగా సాధికారత లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు నెలకొన్నప్పటికీ.. భారత ఆర్థిక వ్యవస్థ మాత్రం బలమైన పునాదులపై నిలిచి ఉందని ఈ సందర్భగా మోదీ ప్రస్తావించారు. దీంతో 2026-27 ఆర్థిక ఏడాది తొలి త్రైమాసికంలో జీడీపీ వృద్ధి 7.8 శాతంగా నమోదైందని పేర్కొన్నారు. హరిత ఇంధన రంగంలోనూ భారత్ గణనీయమైన వృద్ధిని సాధించిందన్నారు. 2014లో దేశ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం సుమారు 75 గిగావాట్లుగా ఉండగా.. ప్రస్తుతం అది 300 గిగావాట్లకు ఎగబాకిందని చెప్పుకొచ్చారు.

దీంతో స్వచ్ఛ ఇంధన రంగం కొత్త ఆర్థిక అవకాశాలకు మార్గం సుగమం చేస్తోందని తెలిపారు మోదీ. భారత్ ప్రజాస్వామ్యానికి పుట్టినిల్లు లాంటిదని అభివర్ణించిన మోదీ.. దేశంలో 100కు పైగా భాషలు, సుమారు 80 వేల వార్తాపత్రికలు, ప్రచురణలు, వెయ్యికి పైగా శాటిలైట్ టీవీ ఛానళ్లు ఉన్నాయని తెలిపారు. యూట్యూబ్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సోషల్ మీడియా



అకౌంట్లలోనూ 50 కోట్ల మందికి భారతీయులు చురుగ్గా ఉంటున్నారని వివరించారు. వ్యక్తుల భిన్నాభిప్రాయాలను బహిరంగంగా చర్చించుకునేందుకు డిజిటల్ టెక్నాలజీ ఎంతగానో దోహదపడుతోందన్నారు.

ప్రభుత్వానికి అధికారం ఉన్నప్పటికీ.. అజమాయిషీ చెలాయించడం, ప్రజలను వ్యవస్థపై ఆధారపడేలా చేయడం దాని లక్ష్యం కాకూడదని మోదీ పేర్కొన్నారు. బదులుగా వారిని మరింత బలోపేతం చేసి, సాధికారత కల్పించి ఎదిగేలా చేయడానికి అది ఉపయోగపడాలని.. ప్రస్తుతం భారత్ అదే మార్గంలో పయనిస్తోందని తెలిపారు. ఈ క్రమంలో పదేళ్లలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారన్న ఆయన.. ఇది ప్రపంచంలోని అనేక దేశాల జనాభా కంటే ఎక్కువ అని పేర్కొన్నారు.

ఎన్నికల్లో గెలవలేక

రాజ్యంగ సంస్థలపై దండయాత్ర..

కాంగ్రెస్‌పై కిషన్‌రెడ్డి విమర్శలు



ఢిల్లీ, అక్టోబర్ 13: దేశ రాజధాని ఢిల్లీలో కాంగ్రెస్ చేస్తున్న నిరసన డ్రామాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. రాహుల్ గాంధీ తన స్థాయి మరిచిపోయి వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. గతంలో లోక్‌సభ స్పీకర్ రాజీనామా అన్నారని.. ఇప్పుడు సీఈసీ రాజీనామా అంటున్నారని అన్నారు. ప్రధాని మోదీ, అమిత్ షా, ఆర్ఎస్ఎస్ చీఫ్‌పై ఆరోపణలు చేస్తున్నారని.. చివరికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గద్దెదిగాలని కాంగ్రెస్ పార్టీ మాట్లాడుతోందని మండిపడ్డారు. సుప్రీంకోర్టు సీజేఐ రాజీనామా చేయాలనడం శోచనీయమని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. వేలాదిగా సుప్రీంకోర్టుకు వెళ్లి న్యాయమూర్తులపై ఒత్తిడి తెచ్చి బెదిరిస్తున్నారని మండిపడ్డారు. ఎన్నికలలో గెలవడం చేతగాక రాజ్యాంగ సంస్థలపై దండయాత్ర చేస్తున్నారని విరుచుకుపడ్డారు. 60 ఏళ్ల పరిపాలించిన కాంగ్రెస్ మానసికస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజల మద్దతు లేకుండా అనేక ఏళ్లుగా వరుసగా ఓడిపోతుంటే దానికి ఎన్నికల సంఘం ఏ విధంగా బాధ్యత తీసుకుంటుందని ప్రశ్నించారు. సుప్రీంకోర్టు న్యాయమూర్తిని బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని ఫైర్ అయ్యారు. ఎన్నికల్లో ఓడిపోతున్నారని సుప్రీంకోర్టు జడ్జిలను బెదిరిస్తున్నారని కేంద్ర మంత్రి ఆరోపించారు. కాంగ్రెస్‌కు ఓటు వేయకపోతే ప్రజల తప్పు అన్నట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. రాహుల్ దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. 200 మంది అధికారులు టచ్‌లో ఉన్నారని రాహుల్ గాంధీ అంటున్నారని.. ఎవరిని బెదిరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ అవినీతి అరాచకాలను ప్రజలు మర్చిపోలేదని కేంద్ర మంత్రి అన్నారు. మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, బాబు జగ్జీవన్ రాం, ఎన్టీఆర్‌ను కాంగ్రెస్ పార్టీ అవమానపరిచిందన్నారు. రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి పోటీ పడుతున్నారని తెలిపారు. రాహుల్ గజం ఎగిరితే, రేవంత్ రెండుగజాలు ఎగురుతున్నాంటూ ఎద్దేవా చేశారు. హైదరాబాద్‌లో తాము ఏ ధర్నా చేయాలన్నా హౌస్ అరెస్ట్ చేస్తున్నారని.. హైకోర్టుకు వెళ్లి అనుమతి తీసుకుంటే తప్ప ధర్నా చేయలేని పరిస్థితి ఉందన్నారు. హైదరాబాద్‌లో ధర్నాకు బీజేపీకి పర్మిషన్ ఇవ్వరని.. ఢిల్లీలో మాత్రం ధర్నాకు అనుమతి ఇస్తలేరని నీతులు చెబుతున్నారని మండిపడ్డారు. వారానికి ఒకసారి ఢిల్లీ వచ్చి ప్రధానిపై రేవంత్ రెడ్డి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ షిఫ్ట్ చేయాలని స్థానిక ప్రజలు, వ్యాపారులు కోరారని తెలిపారు. ఎప్పుడు ఏం జరుగుతుందో తెలియని పరిస్థితులలో ఢిల్లీ ప్రజలు ఉన్నారని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

త్వరలో సింగరేణి కార్మికులకు

సొంతిల్లు: భట్టి విక్రమార్క

హైదరాబాద్,అక్టోబర్,13:సింగరేణిలో పెండింగ్ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తోందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. సింగరేణి కార్మికుల సమస్యలు సుదీర్ఘ కాలంగా పెండింగ్ లో ఉన్నాయని కొన్ని అంశాలపై స్పష్టమైన నిర్ణయాలు తీసుకున్నామన్నారు. పెండింగ్?లో ఉన్న 300 కారుణ్య నియామకాలు 15 రోజుల్లో పూర్తి చేస్తామని అలాగే అలియాస్ పేర్ల అంశానికి సంబంధించి 15 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబోతున్నామని తెలిపారు. ఇవాళ మంత్రి శ్రీధర్ బాబుతో కలిసి ప్రజాభవన్ లో మీడియాతో ఆయన మాట్లా?డారు. ఇక నుంచి సింగరేణి కార్మికులకు మెడికల్ ఇన్ వాలిడేషన్ ఆయా ఏరియా ఆసుపత్రిలోనే జరుగుతుందన్నారు. కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ‘నెహ్రూ కాలనీల’ పేరుతో క్వార్టర్ల నిర్మాణం, ఏరియా ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయికి మించి ఆధునీకరించి అత్యుత్తమ వైద్య సదుపాయాల కల్పనకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని భట్టితెలిపారు. సింగరేణి కార్మికుల సంక్షేమమే మా ప్రభుత్వ ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. సింగరేణి కార్మికులకు లాభాల్లో దసరా బోనస్



34 శాతం ప్రకటించిన డిప్యూటీ సీఎం..సింగరేణికి రూ.1,754 కోట్ల మేర లాభాలు వచ్చాయని, ఒక్కో ఉద్యోగికి రూ. 1,53,912 వస్తుందన్నారు. సింగరేణి శాశ్వత కార్మికులుగా 38 వేల మంది ఉన్నారని మరో 30వేల మంది కాంట్రాక్ట్ వర్కర్లు ఉన్నారని చెప్పారు. కాంట్రాక్ట్ ఎంప్లాయిస్?కురూ. 5,500 బోనస్ ఇస్తామన్నారు.

రైతు డిస్కమ్ పేరుతో

ఉచిత విద్యుత్‌కు ఎసరు పెట్టే కుట్ర

- హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం



హైదరాబాద్,అక్టోబర్,13:రాష్ట్రంలో మ్నూరీడో విద్యుత్ పంపిణీ సంస్థగా ఏర్పాటైన తెలంగాణ రైతు పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఆర్‌పీడీసీఎల్) ఉద్యోగులు, విద్యుత్ పంపిణీ నెట్ వర్క్, ఆస్తులు, అప్పులు, విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు ఇతర బాధ్యతలను బదిలీ చేస్తూ ప్రభుత్వం జీవో 17ను జారీ చేయడంపై బీఆర్ఎస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. రైతు డిస్కమ్ పేరుతో ఉచిత విద్యుత్?కు ఎసరు పెట్టే కుట్ర అని మాజీ మంత్రి బిఆర్ఎస్ఎల్పీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు విమర్శించారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ సహా ఇతర రాజకీయ పార్టీలు, ఉద్యోగ సంఘాలు, విద్యుత్ రంగ నిపుణులు, సామాజికవేత్తలు, రైతులు లేవనెత్తుతున్న అభ్యంతరాలను బేఖాతరు చేస్తూ రైతు డిస్కమ్ ఏర్పాటు చేస్తూ జీవోజారీ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. వ్యవసాయానికి, గృహాలకు, పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయలేకపోతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఇప్పుడు రైతు డిస్కమ్ పేరుతో మరో డ్రామాకు తెరతీయడం సిగ్గుచేటు అని, రైతు డిస్కమ్ ఏర్పాటు జీవో జారీ కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ, దుర్మార్గ వైఖరికి నిదర్శనం అన్నారు. ఉచిత విద్యుత్ సరఫరాకు పాతరేసి, రైతు మెడకు ఊరేసేందుకేనా ఈ కుట్ర? అని నిలదీశారు. రైతు డిస్కమ్ ఏర్పాటు వల్ల రైతులకు ఒరిగే ప్రయోజనం ఏమిటి? రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించేందుకు ఈ నిర్ణయం ఎలా దోహదపడుతుందో చెప్పకుండా మొండిగా వ్యవహరించడం దుర్మార్గం అన్నారు. సర్కార్ నిర్వాకంతో అన్నదాతలు మరింత ఇబ్బందుల్లోకి వెళ్తారని ఇప్పటికే ట్రాన్స్ఫార్మర్స్ కాలిపోతే దిక్కు లేదు..రేపు రైతు డిస్కంతో మరింత ఇబ్బందులు తలెత్తే పరిస్థితి ఎదురవబోతోందన్నారు. రైతు మెడకు రైతు డిస్కం ఉచ్చు కాబోతోందని.. ఉచిత విద్యుత్?పై చేతులెత్తేసేందుకే సర్కార్ కొత్త ఎత్తుగడ అని విమర్శించారు.

పాలకుల నిర్లక్ష్యం పై త్వరలో

పాత్రికేయుల పోరుబాట

- టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య

డీకే చాటింపు ప్రతినిధి(హైదరాబాద్): జర్నలిస్టుల సమస్యల పరిష్కారంలో మాట తప్పిన పాలకుల వైఖరి పై త్వరలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ చేపడతామని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య ప్రకటించారు. మంగళవారం హైదరాబాద్ లోని ఫెడరేషన్ రాష్ట్ర కార్యాలయంలో సంగారెడ్డి జిల్లాకు చెందిన సీనియర్ జర్నలిస్టులు, టీజేయు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు ఏటీ రాజారావు, కే. రాజశేఖర్ యాదవ్ లతో పాటు పలువురు స్థానిక జర్నలిస్టులు టీడబ్ల్యూజేఎఫ్ లో చేరారు. ఈ సందర్భంగా వీరికి రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య సభ్యత్వం ఇచ్చారు.

అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు కావస్తున్నా, జర్నలిస్టుల సమస్యలు ఏఒక్కటీ పరిష్కారం కాలేదని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ళస్థలాల విషయంలో ముఖ్యమంత్రి మాట తప్పారని, అక్రెడిటేషన్ కార్డుల పంపిణి వ్యవస్థ అస్తవ్యస్థంగా తయారైందని, జర్నలిస్టుల ఆరోగ్య సమస్య, సామాజిక భద్రతలనుగాలికి వదిలేశారని ధ్వజమెత్తారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి వల్ల జర్నలిస్టులు అనేక ఇబ్బందు పడుతున్నారని, ఇంటి జాగల కోసం ఎదురు చూసిఎంతోమంది జర్నలిస్టులు చనిపోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ప్రోత్సాహం లేక అనేక చిన్న, మ



ధ్యతరహా పత్రికలు, కేబుల్ ఛానళ్ళు మూతపడుతున్నాయని అన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి పై త్వరలో టీడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్త కార్యాచరణ ఉంటుందని మామిడి సోమయ్య స్పష్టం చేశారు. జర్నలిస్టుల హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న టీడబ్ల్యూజేఎఫ్‌కు జర్నలిస్టులంతా అండగా ఉండాలని, జిల్లాల్లో సంఘాన్ని బలోపేతం చేయాలని ఆయన కోరారు. సంగారెడ్డి జిల్లాలో త్వరలో నూతన నాయకత్వంలో మహాసభ జరుగుతుందని తెలిపారు.

హైదరాబాద్ నీటి సరఫరాపై వదంతులు.. క్లారిటీ ఇచ్చిన జలమండలి



హైదరాబాద్,అక్టోబర్,13:హైదరాబాద్ నగరంలో నీటి సరఫరాపై వాట్సప్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల్లో తమ పేరుతో ప్రచారమవుతున్న సందేశం పూర్తిగా అవాస్తవమని హైదరాబాద్ జలమండలి (హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్బీ) స్పష్టం చేసింది.

ఎన్నినో ప్రభావం, కరవు పరిస్థితుల కారణంగా నవంబర్ చివరి నాటికి హైదరాబాద్‌కు నీటిని సరఫరా చేసే జలాశయాలు ఎండిపోతాయని, దీంతో నగరంలో నీటి సరఫరాను నిలిపివేస్తారని లేదా తీవ్ర ఆంక్షలు విధిస్తారని ఒక మెసేజ్ కొద్ది రోజులుగా వైరల్ అవుతోంది.

ఉద్యోగుల భద్రత - రెగ్యులరీసేషన్ కై డిమాండ్

ఎన్.హెచ్.ఎం ఉద్యోగుల నిరవధిక సమ్మె



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 13 (డీకే చాటింపు): నేషనల్ హెల్త్ మిషన్ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న ప్రభుత్వాలు తమ సమస్యలు పరిష్క రించుటలో కాలయాపన చేస్తూ ఆవేదనకు గురి చేస్తుందని ఉద్యోగుల జాయింట్ ఆక్షన్ కమిటీ అన్నారు. గత 20 రోజులుగా వివిధ రకాలుగా నిరసన తెలియజేస్తూ అధికారులకు సమస్యలు విన్నవించిన పట్టించుకోకపోవడంతో తప్పని పరిస్థితుల్లో సమ్మెకు దిగినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యం కోసం అహర్నిశలు సేవ చేశాము అంతేకాకుండా కరోనా మహమ్మారి సమయంలో కూడా ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవలు అందించాలని అయినప్పటికీ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉంటుందని వాపోయారు. తప్పని పరిస్థితుల్లో సమ్మె చేస్తున్నామని ఇది ప్రజలకు వ్యతిరేకం కదా అని మా న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని ఉద్దేశంతో సమ్మెకు దిగామని అన్నారు. నేషనల్ హెల్త్ మిషన్లో 17,000 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారని కనీస వేతనం ఉద్యోగ భద్రత కల్పించాలని ప్రధాన డిమాండ్ అని జేఏసీ నాయకులు విశాలరాణి, సందీప్,నారాయణ,షాదుల్లా,పుష్ప,మురళి, అలేఖ్య ,లావణ్య తదితర నాయకులు తెలిపారు.

స్తంభించిన వైద్య సేవలు

నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో వేలాది మంది ఉద్యోగులు మెరుపు సమ్మె దిగడంతో జిల్లా కార్యాలయం లో ,ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ,అర్బన్ కేంద్రాల్లో, మిడిల్ లెవెల్ ప్రొవైడర్స్,ఆయుష్ దవాఖానాలు మూతపడే పరిస్థితి వచ్చింది. ప్రజలకు అందాల్సిన సేవలు నిలిచిపోయాయి. ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం తగదని పౌర సమాజాలు, వివిధ సంఘాల వారు కోరుతూ, ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నారాయణపేట ప్రభుత్వ జనరల్

ఆసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

-3.5 కిలోల బరువున్న రొమ్ము గడ్డ తొలగింపు... -ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.సంపత్ కుమార్ సింగ్...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అరుదైన ఫిలోడ్స్ ట్యూమర్ వ్యాధితో బాధపడుతున్న ఓ మహిళకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు.ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నారు.కర్ణాటక రాష్ట్రం గుర్మిట్కల్ గ్రామానికి చెందిన శంకరమ్మ(భర్త జగదీష్)గత ఎనిమిది ఏళ్లుగా కుడివైపు రొమ్ములో గడ్డతో బాధపడుతున్నారు. ఈ నేపథ్యంలో మూడు రోజుల క్రితం ఆమె నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని సందర్శించగా వైద్యులు పరీక్షించి చికిత్స నిమిత్తం ఆసుపత్రిలో చేర్చుకున్నారు. మంగళవారం ఉదయం జనరల్ సర్జరీ విభాగం వైద్య బృందం ఆమెకు విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించింది.ఈ శస్త్రచికిత్సలో 3.50 కిలోల బరువున్న గడ్డను తొలగించి, తదుపరి పరీక్షల నిమిత్తం బయాప్సీ పరీక్షకు పంపించారు.వరీక్షల ఫలితాల ఆధారంగా గడ్డ స్వభావాన్ని నిర్ధారించనున్నారు.ఈ శస్త్రచికిత్సలో జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ మురళీకృష్ణ,డాక్టర్ వినీల రత్న,డాక్టర్ రహీం,డాక్టర్ వివేక్ పాల్గొన్నారు. అనస్థీషియా విభాగం నుంచి డాక్టర్ నీలవర్ణ,డాక్టర్ రమాదేవి,డాక్టర్ సాయికుమార్ సేవలందించారు.స్టాఫ్ నర్సులు ప్రవళిక,స్వప్న, కిరణ్,గోపి శస్త్రచికిత్సకు సహకరించారు.ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. సంపత్ కుమార్ సింగ్ మాట్లాడుతూ నారాయణపేట ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో అనుభవజ్ఞులైన వైద్య బృందం సమన్వయంతో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని తెలిపారు.ఈ శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తికావడం పట్ల ఈ సందర్భంగా ఆయన వైద్య బృందాన్ని అభినందించారు.

దేవరుప్పుల ఎస్సై కి ఘనంగా సన్మానం



జనగామ/దేవరుప్పుల అక్టోబర్ 13 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి జనగామ జిల్లా పాలకుర్తి నియోజకవర్గం దేవరుప్పుల మండల పోలీస్ స్టేషన్ నుంచి పాలకుర్తి పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన దేవరుప్పుల ఎస్సై ని మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా ఎస్సై కి శుభాకాంక్షలు తెలియజేస్తూ, భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టి ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో దేవరుప్పుల మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కోటగిరిలో దేవి మాత 25 వసంతాల ఉత్సవాలు

మండపాలలో దీక్ష పరులతో సందడి





నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 13 (డికె చాటింపు): దేవీ నవరాత్రుల ప్రారంభంతో వాడవాడలో గ్రామ గ్రామాణ పండగ వాతావరణం నెలకొంది. ప్రతి గ్రామంలో పట్టణాలలో దేవీ నవరాత్రుల సందర్భంగా వివిధ రకాల అలంకరణలతో మండపా లను సిద్ధం చేసి భవాని స్వాములు దేవి మాత విగ్రహాలను ఊరేగింపుగా తెచ్చి నిష్ఠతో ప్రతిష్టించారు. కోటగిరి శ్రీ విరలేశ్వర మందిరంలో సార్వజనిక దేవి నవరాత్రులు ఉత్సవం 25 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు.3 రోజులు చండీ యాగాలు ,జబర్దస్త్ టీం తో సాంస్కృతికకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు గాశీడ్ల శ్రీను సాయిలు ,సతీష్, భీమ సాయిరెడ్డి,వల్లేపల్లి శ్రీనివాస్ రావు, కూచి సిద్దు,అరవింద్, ఆనంద్ , బీర్కూర్ శ్యామ్ లు వివరించారు.చిత్తు పక్కల గ్రామాలలో ఆహ్వాన పత్రికలు అందచేస్తున్నారు.గ్రామం అంతటా విద్యుత్ కాంతుల తో పండగ వాతావరణం నెలకొల్పారు.తొమ్మిది రోజులు భజనలు కీర్తనలు హోమాలు చేస్తూ దసరా తర్వాత రోజు జై మాత నిమజ్జనం చేస్తారు.అనేకచోట్ల విద్యుత్ దీపాలతో అలంక రించారు. నిజామాబాద్ పాత కలెక్టరేట్ వద్ద శ్రీ నవదుర్గ దేవి మందిర్, దేవి రోడ్ లోని దేవి



మందిర్, ముబారక్ నగర్‌లోని పెద్దమ్మ తల్లి దేవా లయం, గంగస్థాన్లోని మహాలక్ష్మి ఆలయం గౌడ సంఘం ఆలయం, నేలకల్ రోడ్ లోని శ్రీ లలితా దేవి మందిర్,మహాలక్ష్మి నగర్ లో 9 వ సంవత్సరం దుర్గా మాత ఉస్తవాలు లక్ష్మీ సిల్క్ ఆధ్వర్యంలో , బోధనలోని ఎల్లమ్మ మందిరంలలో నిత్యపూజలతో పాటు ప్రత్యేక పూజలు పూజారులు నిర్వహిస్తున్నారు.

జలాధివాసమైన 5 వారాలకే

'సంగమేశ్వర' శిఖర దర్శనం



కర్నూలు, : సంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైంది. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం. శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలించడంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.కృష్ణా నదికి వరద నీరు చేరినప్పుడు పూర్తిగా జలాధివాసమయ్యే నంద్యాల జిల్లాలోని సంగమేశ్వరాలయం.. మళ్లీ వేసవిలోనే బయటకు వస్తుంది. కానీ, ఈ ఏడాది జలాధివాసమైన కొద్ది రోజుల్లోనే దర్శనమివ్వనుంది. ఆగస్టు 6వ తేదీ సంగమేశ్వరాలయం జలాధివాసమైన సంగతి తెలిసిందే. అయితే, నెల రోజుల తర్వాత ఆలయ శిఖరం దర్శనమిచ్చింది. ఎగువ నుంచి ప్రవాహాలు లేకపోవడం, శ్రీశైలం ప్రాజెక్ట్ నుంచి నీటి విడుదల కారణంగా ఆలయ శిఖరం దర్శనమిచ్చినట్లు ఆలయ పురోహితులు చెబుతున్నారుసంగమేశ్వరాలయ శిఖరం బయటపడటంతో.. ఆలయ పూజారులు జెండా కట్టి పూజలు చేశారు. జలాధివాసం అయ్యాక సాధారణంగా ఐదారు నెలలకు, అంటే వేసవి ప్రారంభంలోనే గానీ ఆలయ శిఖరం కనిపించదు. కానీ ఇప్పుడు నెల రోజుల్లోనే మళ్లీ ఆలయ శిఖరం దర్శనమిచ్చిందని పూజారులు చెబుతున్నారు. ఇరవై మూడేళ్ల కాలంలో ఈసారి తక్కువగా ఐదు వారాల వ్యవధిలోనే శిఖరం కనిపించడం గమనార్హం.శ్రీశైలం జలాశయ పూర్తిస్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా.. ప్రస్తుతం 864 అడుగులకు చేరింది. ప్రస్తుతం ప్రాజెక్టులో 120 టీఎంసీల నీరు నిల్వ ఉంది. ఈ ఏడాది జలాశయం పూర్తిగా నిండకపోవడం, తెలంగాణ వైపు విద్యుదుత్పత్తి చేయడం, ఏపీ ప్రభుత్వం వెలిగొండ ప్రాజెక్టు ద్వారా శ్రీశైలం బ్యాక్ వాటర్‌ను నల్లమల సాగర్ జలాశయానికి తరలిస్తుండటంతో సంగమేశ్వర ఆలయం జలాధివాసం నుంచి బయటకు వచ్చింది.ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్‌లో వర్షాలు లేనప్పటికీ ఎగువన కురిసిన భారీ వర్షాలకు కృష్ణా నదికి వరదలు రావడంతో ఆ నీరు శ్రీశైలం జలాశయానికి చేరింది. దాంతో శ్రీశైలం జలాశయం నీటితో కళకళలాడింది. ఫలితంగా సంగమేశ్వర ఆలయం పూర్తిగా జలాధివాసం అయింది. జలాధివాసం సందర్భంగా పురోహితులు, ఆలయ అర్చకులు గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో చీర, సారె సమర్పించారు. అయితే, తిరిగి ఇప్పుడు శిఖర దర్శనం కావడంతో జెండా కట్టారు.గతేడాది జూన్ 15వ తేదీన సంగమేశ్వరస్వామి గర్భాలయంలోకి నీరు ప్రవేశించగా.. ఈ ఏడాది ఆగస్టు 1వ తేదీన నీరు చేరింది. గతేడాది జూన్ 15న స్వామివారు జలాధివాసం కాగా.. మార్చిలో నీరు తగ్గి ఆలయం బయటపడింది. ఈ ఏడాది ఆగస్టు మొదటి వారంలో ఆలయం జలాధివాసం కాగా.. కేవలం ఐదు వారాల్లోనే ఆలయ శిఖరం కనిపించడం గమనార్హం.మార్చి నెలలో కనిపించాల్సిన సంగమేశ్వర ఆలయ శిఖరం.. వర్షాకాలం పూర్తి కాకముందే కనిపించడం ఎల్‌నినో తీవ్రతకు అద్దం పడుతోంది. ఇప్పుడే పరిస్థితి ఎలా ఉంటే వేసవిలో పరిస్థితి ఏంటి? ఎల్‌నినో తీవ్రమై వచ్చే వర్షాకాలంలో సరిగా వర్షాలు కురవకపోతే ఎలా ఉంటుందనే ఆందోళన ప్రజల్లో వ్యక్తమవుతోంది. జలాధివాసమైన ఐదు వారాలకే సంగమేశ్వర శిఖరం తిరిగి కనిపించడం శివయ్య భక్తులకు ఆనందం కలిగించే విషయమే అయినప్పటికీ.. భవిష్యత్తు సమస్యలకు ఇది ఓ సంకేతం కావచ్చనే భావనా వ్యక్తమవుతోంది. ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు శ్రీశైలం జలాల వినియోగం విషయంలో క్రమశిక్షణతో వ్యవహరించకపోతే భవిష్యత్తులో ఇబ్బందులు తప్పకపోవచ్చు

మహాలక్ష్మి నగర్లో ఘనంగా దేవీ నవరాత్రి ఉత్సవాలు







నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్ 13(డీకే చాటింపు):నిజామాబాద్ నగరంలోని మహాలక్ష్మి నగర్ లో గత తొమ్మిది సంవత్సరాలుగా దేవీ నవరాత్రి ఉత్సవాలు లక్ష్మీ సిల్క్స్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. దేవి ఉత్సవాలు ఈసారి తొమ్మిదవ సారి అని కాలనీవాసులు భక్తులు సహకారంతో విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు శీతల్ వివరించారు. ప్రతిరోజు ఉదయం రాత్రి వివిధ సంస్కృతి కార్యక్రమాలు భజనలు నిర్వహి స్తున్నట్లు తెలిపారు. దేవి మాత అలంకరణ అదేవిధంగా ఆదియోగి విగ్రహా లను ఏర్పాటు చేయడంతో ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంటుంది. సౌందర్యలహరి మహిళా మండలి గ్రూపు వారు ఈరోజు లలితా సహస్రనామ పట్టణం చేశారు.మాధవి,లలిత,సౌజన్య,వాణీ, అన్నపూర్ణ, హరిబాబు,శ్రీహైతదితరులు సేవాకార్యక్రమంలో పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవిగా-అశోక్ నగర్

శ్రీ మాతా మలలాంబికా దేవి...

నారాయణపేట,(డీకే చాటింపు): దేవి శరన్నవరాత్రులు పురస్కరించుకొని నారాయణపేట పట్టణంలోని అశోక్ నగర్ లో వెలసిన
శ్రీ మాతా మలలాంబికా దేవి అమ్మవారు భక్తులకు మంగళవారం (మూడోవ రోజు)అన్నపూర్ణ దేవిగా దర్శనమిచ్చారు.భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



హైబ్రీడ్ మెయిజ్ విత్తనాలను

ఆవిష్కరించిన చంద్రబాబు నాయుడు

ఏలూరు : ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గం ముసునూరులో పర్యటించారు. ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ అబ్దుల్ నజీర్ తో కలిసి గార్మె పాప్ కార్నికా నాన్-ఉఓ పాప్‌కార్న్ మొక్కజొన్న హైబ్రిడ్ విత్తనాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఫ్యాక్టరీని, పాప్ కార్న్ తయారీ విధానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నారా లోకేష్, పార్థసారధి, అచ్చెన్నాయుడు, గార్మె పాప్ కార్నికా ఎండీ ఎస్‌బీపీ పట్టాభిరామారావు , అధికారులు పాల్గొన్నారు.చంద్రబాబు మాట్లాడుతూ రైతులపై ఉన్న ప్రేమ, అభిమానంతో ఏలూరు జిల్లాకు వచ్చి రైతులు పండిస్తున్న జన్యుమార్పిడి జరగని మొక్క జొన్న విత్తనాలను ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్ ఆవిష్కరించారు. గార్మె పాప్ కార్న్ సంస్థ భారత నేలపైనే దేశీయంగా జన్యుమార్పిడి జరగని విత్తనాలను రైతులతో కలిసి ఉత్పత్తి చేస్తోందని అన్నారు.మన నూజివీడు గడ్డ నుంచే పండే పాప్ కార్న్ మొక్క జొన్న దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాలతో పాటు ఇతర దేశాలకూ ఎగుమతి అవుతుంది. గార్మె పాప్ కార్న్ దేశంలోనే అతిపెద్ద పాప్ కార్న్ ఉత్పత్తి సంస్థగా అవతరించింది. ఈ సంస్థ ప్రతినిధుల్ని అభినందిస్తున్నాను 17,500 మంది రైతులతో 40 వేల ఎకరాల్లో ఈ నాన్ జీఎం హైబ్రీడ్ మొక్క జొన్న ఉత్పత్తి చేస్తున్నారు.

ఉమాభవన్ టిఫిన్స్ అధినేత అరికిల్ల దుర్గయ్య మృతి... నివాళి అర్పించిన ప్రముఖులు..



బెల్లంపల్లి (డీకే చాటింపు) పట్టణం లోని ప్రముఖ హోటల్ ఉమా భవన్ అధినేత అరికిల్ల దుర్గయ్య (55) మృతి చెందారు. సోమవారం రాత్రి గుండె పోటు తో మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. దుర్గయ్య హోటల్ యూనియన్ మాజీ అధ్యక్షుడు గా పని చేశారు. వారి మృతికి సంతాపంగా మంగళవారం రోజు బెల్లంపల్లిలోని హోటల్స్ అన్నీ బందు పాటించారు.
దుర్గయ్య మృత దేహానికి పట్టణ ప్రముఖులు బీ ఆర్ ఎస్ నాయకులు రేణికుంట్ల ప్రవీణ్,మాజీ చైర్మన్ సూరిబాబు, తిలక్ వాకర్స్ సభ్యులు రామన్న, నగేష్, హోటల్ యూనియన్ అధ్యక్షులు రేగుంట రాజలింగు, నివాళులు అర్పించారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
బుధవారం,అక్టోబర్,14, 2026

చర్చలే లేని పార్లమెంటు ఎందుకు..?

సభా సమయాన్ని వృధా చేయటం అంటే ప్రజాధనాన్ని వృధా చేయడమే.. గత గురువారం తెరపడిన వర్షాకాల సమావేశాలు ఈ సత్యాన్ని మరోసారి నిర్ధారించాయి. ప్రజా సమస్యలపై ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ పలుమార్లు వాయిదా పడింది. ఎలాంటి చర్చ లేకుండానే 12 బిల్లులు ఆమోదం పొందాయి. వాటిలో 10 బిల్లులు చర్చ లేకుండానే పాస్ అయ్యాయి. రాష్ట్రాల అధికారాలను పరిమితం చేసే ముఖ్యమైన చట్టం కూడా ఆమోదం పొందింది. ఇక ప్రారంభం నుంచి సభలో కనిపించని ప్రధాని, హోమ్ మంత్రి చివరి రోజు మాత్రమే హాజరయ్యారు. వందేమాతరం ఆరు చరణాలు వినిపించిన తర్వాత స్పీకర్ సభను నిరవధికంగా వాయిదా వేశారు.. సాధారణ ముగింపు ప్రసంగం కూడా లేదు. ఇది కేవలం ఒక సమావేశం కాదు. గత పన్నెండేళ్లుగా బీజేపీ పాలనలో కొనసాగుతున్న ఒక పెద్ద రాజకీయ తంతు నమూనా. 2014 నుంచి బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం పార్లమెంట్‌ను చర్చల వేదికగా కాకుండా బిల్లులు పాస్ చేసే యంత్రంగా మార్చేసింది. పదిహేనో లోక్‌సభలో బిల్లుల్లో 71 శాతం పార్లమెంటరీ కమిటీలకు పంపబడ్డాయి. పదహారో లోక్‌సభలో అది 27 శాతానికి పడిపోయింది. పదిహేడో లోక్‌సభలో మరింత తగ్గి 16 శాతానికి చేరుకుంది. పదిహేడో లోక్‌సభలో పాస్ అయిన 172 బిల్లుల్లో 64 బిల్లులు ఒక గంట కంటే తక్కువ చర్చతోనే ఆమోదం పొందాయి.. ముప్పై ఐదు శాతం బిల్లులు గంటలోపు చర్చతోనే పాస్ అయ్యాయి. బడ్జెట్ ప్రతిపాదనల్లో 67 నుంచి 80 శాతం వరకు చర్చ లేకుండానే గిల్లోటిన్ చేయ బడ్డాయి. 2023లో మొత్తం బడ్జెట్ ఏ మాత్రం చర్చ లేకుండానే పాస్ అయింది. ఈ సంఖ్యలు కేవలం గణాంకాలు కావు.. అవి ప్రజాస్వామ్యం బలహీనపడుతున్న దిశను చూపిస్తున్నాయి.పార్లమెంటరీ కమిటీల ప్రాత ఇక్కడ కీలకం. కమిటీలు బిల్లులను వివరంగా పరిశీలిస్తాయి. నిపుణుల అభిప్రాయాలు, వివిధ వర్గాల సూచనలు, ప్రజల అభ్యంతరాలు సేకరించి సవరణలు సూచిస్తాయి. ఇది చట్టాల నాణ్యతను పెంచుతుంది. లోపాలను సరిదిద్దుతు ంది. ప్రజా ప్రయోజనాలను కాపాడుతుంది. కమిటీలకు పంపకుండా బిల్లులు పాస్ చేయడం అంటే ఈ ముఖ్యమైన దశను పక్కన పెట్టడం. గతంలో కమిటీలు సూచించిన సవరణలు చాలా బిల్లులను మెరుగుపరిచాయి. ఇప్పుడు ఆ ప్రక్రియ దాదాపు నిలిచిపోయింది. ఇది కేవలం ప్రక్రి యా లోపం కాదు.. ప్రజాస్వామ్య పర్యవేక్షణ బలహీన పడడం. రాష్ట్రాల హక్కులపై ప్రభావం మరింత ఆందోళనకరం. గనులు, ఖనిజాల సవరణ బిల్లు రాష్ట్రాల అధికారాలను పరిమితం చేస్తూ కేంద్రానికి మరిన్ని అధికారాలు ఇస్తోంది. సమాఖ్య వ్యవస్థలో రాష్ట్రాలు తమ సహజ వనరులపై నియంత్రణ కలిగి ఉండాలి. ఆ హక్కులను కేంద్రం తగ్గించడం సమాఖ్య సూత్రాలకు వ్యతిరేకం. చర్చ లేకుండా, కమిటీ పరిశీలన లేకుండా ఇలాంటి బిల్లులు పాస్ అవ్వడం రాష్ట్రాల స్వయంపాలనను బలహీనపరుస్తుం ది. రాష్ట్రాలు తమ అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా విధానాలు రూపొందించుకునే స్వేచ్ఛ తగ్గుతుంది. ఇది కేంద్ర-రాష్ట్ర సంబంధాల్లో ఉద్రిక్తతలు పెంచుతుంది. ప్రజలకు సమీ పంగా ఉండే రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయాలు తీసుకునే అవకాశం తగ్గితే ప్రజాస్వామ్యం మరింత దూరమవుతుంది.పార్లమెంట్ అనేది ప్రజల సమస్యలు చర్చించే వేదిక. ఇక్కడ చట్టాలు రూపొందించడం మాత్రమే కాదు.. ప్రభుత్వాన్ని నిలదీయడం, విధానాలను పరిశీలించ డం కూడా జరగాలి. కానీ ఇప్పుడు జరుగుతున్నది దానికి వ్యతిరేకం. ప్రతిపక్షాలు నిరసనలు వ్యక్తం చేస్తే సభ వాయిదా పడుతుంది. వాయిదా పడినా బిల్లులు మాత్రం పాస్ అవుతా యి. మంత్రి మాత్రమే మాట్లాడి, మిగతా సభ్యులు మౌనంగా ఉండి,వాయిస్ వోట్‌తో చట్టాలు అవుతున్నాయి. ఇది చర్చ కాదు..ఆమోదం మాత్రమే. ప్రజల డబ్బుతో నడిచే సభలో సమయం వృధా కావడం ప్రజాధనం వృధా కావడమే. ఒక సమావేశం నడపడానికి కోట్ల రూపాయలు ఖర్చవు తాయి. ఆ సమ యంలో చర్చ జరగకపోతే ఆ ఖర్చు ఎందుకు? ప్రతిపక్షాలు కూడా తమ నిరసనలను సభలో చర్చగా మార్చుకోవాల్సిన అవసరం ఉంది. కానీ ప్రభుత్వం తన సంఖ్యాబలంతో సభను నడిపిస్తూ చర్చను పక్కన పెట్టడం ప్రజా స్వామ్య స్ఫూర్తికి వ్యతిరేకం. గతంలో కూడా కొన్ని బిల్లులు తొందరగా పాస్ అయ్యాయి.. కానీ ఇప్పుడు అది నియమంగా మారిపోయింది.



గాయత్రి దేవి గా రుద్రేశ్వర దేవి అలంకరణ



హన్మకొండ (డి. కె చాటింపు)చారిత్రిక రుద్రేశ్వర స్వామి వేయి స్తంభాల దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో మూడవరోజు మంగళవారం ఉదయం నిత్యాహ్నిక కార్యక్రమాలు నవాహ్నిక దీక్షతో రుద్రేశ్వరీదేవి ఉత్సవాల్లో భాగంగా చతుస్నానార్చన చంద్రఘంటా దుర్గార్చన నిర్వహించి రుద్రేశ్వరీ దేవిని గాయత్రీ దేవిగా అలంకరించడమైనది సకల వేద స్వరూపమైన గాయత్రిని ఆదిశంకరులు పూజించారు ఆయా దేవతలు మూలమంత్రాలతో గాయత్రి సంప్రోక్షణ చేసిన తర్వాతనే పూజలు చేస్తారు వేదమాతగా ప్రసిద్ధి చెందిన గాయత్రిని షోడశోపచార పూజలతో ముక్త హేమ నీల దవలవర్ణాలతో ఉండే పుష్పాలతో పూజించడమైనది ఆ తల్లి అధిష్టాన దేవత సూర్య భగవానుడు కనుక గాయత్రి అమ్మవారిని పూజిస్తే అనుగ్రహం లభిస్తుంది గాయత్రి ఉపాసనతో బుద్ధి తేజోవంతం అవుతుంది గాయత్రిని ధ్యానిస్తే సకల మంత్రసిద్ధి లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి ఈరోజు అమ్మవారికి అల్లం గ్యారలు ఐదు రకాల పిండి వంటలు నివేదన సమర్పించి భక్తులంతా గాయత్రీ మంత్ర పారాయణం చేస్తుండగా రుద్దేశ్వరి దేవిని సింహ వాహనంపై మంగళ వాయిద్యాలు ముత్తైదువుల మంగళ హారతులతో రుద్రేశ్వరీ దేవి కి జై అంటూ వాహనసేవ నిర్వహించనైనది లోకకళ్యానార్థం గ్రామ జిల్లా రాష్ట్రంలో ప్రజలను కరువు కాటకాల నుండి కాపాడాలని గణపతి నవగ్రహ రుద్ర హోమాలు మూలమంత్ర యుక్తంగా వైదికోక్తంగా దక్షిణాచార శాక్తద్వైత సప్తశతి పారాయణంతో 18 అధ్యాయాయాలతో దేవి ఉపాసకులు భరత్ శర్మ మహా చండీయాగం నిర్వహించారు ఆలయ ప్రాంగణంలో వేలాది మంది భక్తులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారి దాతృత్వంలో నిత్యాన్నదానం నిర్వహించడం జరిగినది సాయంకాల సమయంలో తాడూరి రేణుక శిష్య బృందం చే కూచిపూడి నృత్యం నిర్వహించినైనది ఈరోజు పల్లకి సేవలో నీలం సుహాస్ గారు మాడిశెట్టి సతీష్ నల్లెల లక్ష్మణ్ కోన శ్రీకర్ పల్లం రమేష్.గుజ్జా సంపత్ రావు సౌమ్య దంపతులు మంద రాకేష్ తదితరులు వాహన సేవలో పాల్గొని తమ సేవలు అందించారు ఆలయ ఈవో డి అనిల్ కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్ర శర్మ వైదిక కార్యక్రమాలు నిర్వహించారు

గడ్డి అన్నవర క్షేత్రం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి
దేవస్థానం లో ఘనంగా దసరా నరాత్రులు



ఎల్బీనగర్,(డీకే చాటింపు) గడ్డి అన్నవర క్షేత్రం శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామి దేవస్థానం లో దసరా నరాత్రుల సందర్భంగా అన్నపూర్ణా దేవి అలంకరణ అన్నప్రసాదము వితరణ జరిగినది, అన్నప్రసాదము స్వీకరించిన వారు సుమారుగా 350 మంది వరకు వచ్చారు. చైర్మన్ దేవర లింగారెడ్డి గారు మాట్లాడుతూ దేవాలయం లో జరిగే ప్రతి కార్యక్రమం భక్తులకు అనుగుణముగా జరుగుతూ ఉంటాయి. ప్రతిరోజు స్వామి వారి ప్రతాలు జరుగుతాయి అని అన్నారు. అమ్మవారి విగ్రహదాతలు ఆలయ ప్రధాన కార్యదర్శి చకిలం రమణయ్యా గారు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చిఆలయ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి స్వామి మరియు అమ్మ వారి ఆసిస్సులు ఉంటాయి అని అన్నారు. ఆలయ కోశాధికారి వక్కలంక శ్రీనివాస్ రావు మాట్లాడుతూ అమ్మవారి దగ్గర లోకకళ్యాణం కొరకు 17వతారీఖున లక్ష్మి హోమము, వరుణ హోమము జరుపబడుచున్నది, కావున భక్తులు అధిక సంఖ్యలో పాలుగోనాలని అన్నారు. అమ్మవారి మండపాల దగ్గర హోమాలు చేస్తున్న వారు వరుణ హోమాలు చేయిస్తే బాగుంటుంది ఏలినో ప్రభావం కొంత వరకైనా వర్షం కొరకు లోకకల్యాణ కోరకు చేస్తారని శ్రీనివాస్ గారు అన్నారు. ఆలయ సంయుక్త కార్యదర్శి భాషపాక సంతోష్ మాట్లాడుతూ 18 వ తారీకున్న భక్తుల కొరకు అమ్మవారి దగ్గర చండీ హోమము తలపెట్టమని అన్నారు.ఈ కార్యక్రమములో మాజీ చైర్మెన్ బచ్చు సత్య నారాయణ పాలుగోన్నారు

విశ్వబ్రాహ్మణ సమాజ ఆత్మగౌరవ ప్రతీక శ్రీ సిరికొండ మధుసూదనాచారి 71వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహణ

కేక్ కట్ చేసి సంబరాలు - శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ



కరీంనగర్ అక్టోబర్ 13 (డికె చాటింపు) : విశ్వకర్మ (విశ్వబ్రాహ్మణ) ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ కరీంనగర్ జిల్లా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతి, ప్రస్తుత శాసనమండలి ప్రతిపక్ష నేత, విశ్వబ్రాహ్మణ సమాజానికి చెందిన ప్రముఖ నాయకులు గౌరవ శ్రీ సిరికొండ మధుసూదనాచారి గారి 71వ జన్మదిన వేడుకలను ఘనంగా, ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు కేక్ కట్ చేసి శ్రీ సిరికొండ మధుసూదనాచారి గారికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయన ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని, ప్రజాసేవలో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, సమాజ అభ్యున్నతికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, శ్రీ సిరికొండ మధుసూదనాచారి గారు తెలంగాణ రాష్ట్ర తొలి శాసనసభాపతిగా బాధ్యతలు నిర్వర్తించి రాష్ట్ర చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ప్రజాజీవితంలో ఆయన ప్రస్థానం, నాయకత్వ అనుభవం, సామాజిక రంగంలో ఆయనకు ఉన్న గుర్తింపు విశ్వబ్రాహ్మణ సమాజానికి గర్వకారణమని తెలిపారు. సమాజంలోని యువత, విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని విద్యా, ఉద్యోగ, సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు ఇటువంటి నాయకుల ప్రస్థానం స్ఫూర్తినిస్తుందని పేర్కొన్నారు. జన్మదిన వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా,ఇందులో భాగంగా కరీంనగర్‌లోని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వృద్ధాశ్రమాన్ని సందర్శించి, అక్కడ నివసిస్తున్న వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. వృద్ధులతో ఆత్మీయంగా మాట్లాడి, వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వేవా జిల్లా అధ్యక్షులు కట్టా రవీంద్ర చారి గౌరవాధ్యక్షులు గద్దె జగదీశ్వరా చారి కోశాధికారి వెలిచాల వెంకటస్వామి వేవా రాష్ట్ర, జిల్లా నాయకులు కడార్ల రవీందర్, కందుకూరి దయానంద్, బూరుగుపల్లి రవీందర్, కందుకూరి శ్రీనివాస్, పెద్దప్యాట రాజు, అనసూరి నాగభూషణం, వృద్ధాశ్రమ నిర్వాహకులు వీర మాధవ్ తదితరులు పాల్గొన్నారు

16 నుండి రైల్వే అండర్ పాస్ పనులు ట్రాఫిక్ డైవర్షన్

పోలీస్ కమిషనర్ సాయిచైతన్య



నిజామాబాద్ ప్రతినిధి అక్టోబర్13(డీకే చాటింపు): నిజామాబాద్ నగర ప్రజలకు తెలియజేయునది ఏమనగా, పట్టణంలో గల కంటేశ్వర్ రైల్వే అండర్పాస్ అనగా ఎన్టీఆర్ చౌరస్తా వైపు నుండి జెడ్పి చౌరస్తా మరియు కంటేశ్వర్ బైపాస్ వెళ్లే దారిలో ఒకవైపు గల రైల్వే అండర్పాస్ విస్తారణ పనులను దక్షిణ మధ్య రైల్వే డబుల్ ట్రాక్ వర్క్ చేపట్టడం మొదలు పెడుతున్నందున రేపటి నుండి అనగా తేదీ 16-10-2026 ఉదయము నుండి సుమారుగా (45) రోజుల వరకు వాహనాలు వెళ్లడానికి మూసి వేయబడును, కావున వాహనదారులు ఈ క్రింద తెలుపబడిన మార్గాల గుండా తమ యొక్క ప్రయాణాలు సాగించాలి అని పోలీస్ కమిషనర్ సాయి చైతన్య తెలిపారు.వాహనదారులు ఈ సూచనలు పాటించాలని కోరారు1) నిజామాబాదు లోపలికి వచ్చే వాహనాలు నిజామాబాదు పట్టణము లోపలికి వచ్చే వాహనాలు అనగా ఆర్మూర్ , నిర్మల్ , అదిలాబాద్ , కరీంనగర్ మరియు కామారెడ్డి , హైదరాబాద్ నుండి నిజామాబాద్ పట్టణం లో లోపలికి వచ్చే వాహనాలు నేరుగా పాత దారి వెంబటే అనగా, కంటేశ్వర్ బైపాస్, మీసేవ కంటేశ్వర్, ఒకవైపు పని పూర్తి అయిన రైల్వే అండర్ పాస్ గుండా ప్రయాణిస్తూ ఎన్టీఆర్ చౌరస్తా చేరుకొని అక్కడి నుండి కుడి చేతి వైపు తిరిగి రైల్వే స్టేషన్ ముందర నుంచి బస్టాండ్ చేరుకోవాలి. 2) అలాగే నిజామాబాద్ వైపు నుండి ఆర్మూరు, కరీంనగర్, అదిలాబాద్, నిర్మల్ మరియు కామారెడ్డి, హోహైదరాబాద్ వైపు వెళ్లే వాహనాలుli దేవీ రోడ్డు రైల్వే ఫ్లై ఓవర్ ని ఉపయోగించి దుబ్బ శివాజీ స్టాచ్యూ, దుబ్బ రోడ్ లో ప్రయాణిస్తూ దుబ్బా చౌరస్తా శ్రీ మహాలక్ష్మి టెంపుల్ వద్ద ఎడమ చేతి వైపు మలిపి ఖానాపూర్ చౌరస్తా చేరుకోవచ్చు, అలాగే మహాలక్ష్మి టెంపుల్ దుబ్బ చౌరస్తా నుండి నేరుగా కూడా +.+ కాలేజ్ టర్న్ దాకా వెళ్లి బైపాస్ చేరుకోవచ్చు , బైపాస్ నుండి కంటేశ్వర్ ణ.ా చౌరస్తా చేరుకోవచ్చు. 3) ఇంతే కాకుండా హైదరాబాదు మరియు కామారెడ్డి వెళ్లే వాహనదారులుఎన్టీఆర్ చౌరస్తా, కోర్ట్ చౌరస్తా, పులాంగ్ చౌరస్తా నుండి మాధవ నగర్ రైల్వే గేట్ దాటుతూ మాధవ నగర్ బైపాస్ నుండి హైదరాబాద్ రోడ్డు చేరుకోవచ్చు. 4) అలాగే బోధన్ , బాన్సువాడ మరియు వర్ని వెళ్లే వాహనాలులి యధావిధిగా పాత మార్గమునే అనుసరించి ప్రయాణం సాగించాలి. కావున నిజామాబాద్ నగర ప్రజలకు , ఈ రైల్వే అండర్పాస్ పని సుమారుగా (45) రోజులు జరిగే అవకాశం ఉన్నందున , పై తెలిపిన దారులను ఉపయోగించుకొని పట్టణంలోనికి రావడము మరియు పట్టణం నుండి బయటకు పోవడం కొనసాగించాలని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ.పి.సాయి చైతన్య విజ్ఞప్తి చేశారు

అత్యవసరంగా సాంప్రదించ వలసిన కాంటాక్ట్ నంబర్లు

1.నిజామాబాద్ ఆర్టీసీ కంట్రోల్ రూమ్ 9959226022.

2.పోలీస్ కంట్రోల్ రూమ్ cell- 8712659700 మరియు Land Line Number 08462-226090.3.SHO Traffic PS Nizamabad Cell No. 8712659842.

దుర్గామాతకు ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య...



బెల్లంపల్లి(డీకే చాటింపు) శరన్న నవరాత్రి వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో కన్నాల బస్తీ 1వ వార్డ్ లో నవదుర్గ ఉత్సవ కమిటీ ఆహ్వానం మేరకు మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య దుర్గామాత , అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు దుర్గం చిన్నయ్యకు ఉత్సవ కమిటీ సభ్యులు పెంచాల రమేష్, కార్తీక్, సాయికిరణ్, రాజేంద్ర ప్రసాద్, కొయ్యడ సంజయ్, తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఏర్పాటు చేసిన భారీ అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో ఆయన స్వయంగా పాల్గొని భక్తులకు ప్రసాదం వడ్డించారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు బత్తల సుదర్శన్, ఏలూరి వెంకటేష్,శ్రావణ్‌తో పాటు స్థానిక బీఆర్ఎస్ కార్యకర్తలు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మవారికి ఉప్పల్ ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు



మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా(డీకే చాటింపు): దేవి నవరాత్రుల పర్వదినాల సందర్భంగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద వితరణలో పాల్గొన్నారు. భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. నియోజకవర్గ పరిధిలోని ఉప్పల్, రామంతాపూర్ డివిజన్లలో జరిగిన కార్యక్రమాలకు హాజరయ్యారు. ఆలయ ఆవరణలో మొక్క నాటారు. లోకంలోని ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు చెప్పారు. దేవి నవరాత్రులు భక్తి, ఆధ్యాత్మికత, ఐక్యతకు ప్రతీకలని, అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరికీ మంచి జరగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి వేడుకలు...

నివాళులు అర్పించిన కమ్యూనిస్టు శ్రేణులు...

బెల్లంపల్లి (డీకే చాటింపు) అమరజీవి దివంగత నేత కామ్రేడ్ గుండా మల్లేష్ 6వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు.పట్టణంలోని భగత్ సింగ్ విగ్రహం వద్ద గల గుండ మల్లేష్ విగ్రహానికి పూలమాలవేసి, పట్టణ సిపిఐ కార్యాలయంలో మల్లేష్ చిత్రపటానికి పూలమాలవేసి పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి అధ్యక్షతన వర్ధంతి సభ నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కలవేణు శంకరు, మంచిర్యాల జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి మిట్టపల్లి వెంకటస్వామి హాజరై వారు మాట్లాడుతూ అమరజీవి గుండ మల్లేష్ కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతానికి కట్టుబడి పేద ప్రజల సమస్యలపై అలుపెరుగని ప్రజా ఉద్యమాలు నిర్మించారని, ఆసిఫాబాద్ నియోజక వర్గానికి మూడుసార్లు ఎమ్మెల్యేగా నూతనంగా ఏర్పడిన బెల్లంపల్లి నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా మొత్తం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేశారు. తన జీవితాన్ని అంతా మరణిం చేవరకు ప్రజాసేవకే అంకితం చేసిన త్యాగజీవి. ఆయన జీవితాన్ని మనమం తా ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాన్ని ముందుకు తీసుకుపోవడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో గుండా మల్లేష్ సతీమణి గుండ సరోజన, సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు బొల్లంపూర్ణిమ, జిల్లా కార్యవర్గ సభ్యులు చిప్ప నరసయ్య, పట్టణ సహాయ కార్యదర్శి బొల్లం తిలక్ అంబేద్కర్, బెల్లంపల్లి మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ,మహిళా సమైక్య జిల్లా అధ్యక్షులు బొల్లం సోని,బికేఎంయు జిల్లా కార్యదర్శి గుండ చంద్రమణిక్యం, జిల్లా రైతు సంఘం అధ్యక్షులు మేకల రాజేశం, జిల్లా సమితి సభ్యులు డిఆర్ శ్రీధర్, రత్నం రాజం పాల్గొన్నారు.



ఆ నేత అంటే..ఆ శాఖలకు ఎందుకింత ప్రేమ..!?

నాడు వ్యవసాయ శాఖ.. నేడు విద్యాశాఖ..!

-పదవి కాలం ముగిసిన ప్రోటోకాల్ పొందుతున్న సదరు నేత...! -సదరు నేతను తాము ఆహ్వానించలేదు... -ఆహ్వానితుల బాధ్యతలను కానుకుర్తి గ్రామ సర్పంచ్ చూశారు... -నారాయణపేట జిల్లా విద్యాశాఖ పిఈటిలు... -దామరదిద్ద మండలం కానుకుర్తి గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో... -70వ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 లెవెల్ రెజ్లింగ్ పోటీల ముగింపు కార్యక్రమంలో ప్రోటోకాల్ వివాదాస్పదం...!?



నారాయణపేట,(డీకే చాటింపు):
నాడు వ్యవసాయ శాఖ.. నేడు విద్యాశాఖ..!ఆ నేతకు ఇస్తున్న ప్రాధాన్యత ప్రస్తుతం నారాయణపేట నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. సదరు నేత పదవి కాలం ముగిసిన విషయం జగమెరిగిన సత్యం..!కానీ కొన్ని శాఖల అధికారులు మాత్రం ఇంకా సదరు నేతకు రెడ్ కార్పెట్ పరిచి నేటికీ ప్రోటోకాల్ ఇవ్వడంపై సర్వత్ర చర్చ జరుగుతుంది.ఈ విషయాన్ని పరిశీలిస్తే.. జిల్లాలోని ఆయా శాఖల పనితీరుకు ఇటీవల, తాజాగా జరిగిన ఆయా సంఘటనలే అందుకు నిదర్శనంగా పేర్కొనవచ్చు.!? పదవి కాలం ముగిసినప్పటికీ పలు శాఖల నుంచి సదరు నేత నేటికీ ప్రోటోకాల్ అందుకోవడం నియోజకవర్గం లో వివాదాస్పదంగా మారుతుంది.ఈ నేపథ్యంలో పదవి ముగిసిన తర్వాత తాము ప్రోటోకాల్ ను ఏ విధంగా పొందాలని సదరు నేతకాని..ఆయా శాఖల అధికారులు కానీ దృష్టి కేంద్రీకరించకపోవడం విశేషం. దాంతో ఎవరు ఏమనుకున్నా సదరు నేత మాత్రం దర్జాగా ప్రోటోకాల్ తో వివిధ కార్యక్రమాల్లో పాల్గొని విమర్శలకు గురవుతున్నారు.

దామరగిద్ద మండలంలో

దామరగిద్ద మండలం కానుకుర్తి గ్రామ పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోగత మూడు రోజులుగా జరుగుతున్న 70వ,స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్-14 లెవెల్ రెజ్లింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి.ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అన్నపూర్ణ,ముఖ్య అతిథిగా జిల్లా విద్యాశాఖాధికారి గోవిందు రాజు పాల్గొన్నారు. అయితే ముఖ్య అతిథుల్లో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉన్నట్లు విద్య శాఖ క్రీడల నిర్వాహకులు,ముందుగా పత్రికలకు వివరాలను విడుదల చేశారు. ఈ అంశంపై నిర్వాహకులను విలేకరులు ప్రశ్నించగా సదరు నేతను తాజా మాజీ చైర్మన్ గా పేర్కొంటూ తిరిగి పత్రికలకు వివరాలను సవరించి పంపించారు.ఈ సందర్భంగా నిర్వాహకులు డీకే చాటింపు ప్రతినిధితో మాట్లాడుతూ క్రీడల నిర్వాహణ, ఆహ్వానితుల బాధ్యతలను కానుకుర్తి గ్రామ సర్పంచ్ చూశారని తెలిపారు. మార్కెట్ కమిటీ తాజా మాజీ చైర్మన్ ను విద్య శాఖ పరంగా తాము ఆహ్వానించలేదని పేర్కొన్నారు.మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆ గ్రామ సర్పంచ్ ఆహ్వానించినట్లు వారు తెలిపారు.ప్రోటోకాల్ ప్రకారంగా సదరు నేతను ఆ కార్యక్రమానికి విద్యాశాఖ పరంగా ఆహ్వానించలేదని వారు స్పష్టం చేశారు.ఈ వ్యవహారం మొత్తాన్ని సర్పంచ్ చూసుకున్నట్లు, క్రీడలను తాము నిర్వహించినట్లు కొందరు పీఈటీలు చెప్పుకొచ్చారు. అయితే ఈ కార్యక్రమంపై ప్రతిపక్ష పార్టీలకు చెందిన నేతలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి.విద్యాశాఖ అధికారులు ప్రోటోకాల్ కు విరుద్ధంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు విమర్శించారు.దాంతో సదరు నేత ఆ కార్యక్రమంలో ముఖ్య అతిథిలతో సమానంగా గౌరాన్ని అందుకున్నట్లు వారు పేర్కొన్నారు.నారాయణపేట మండలం కోటకొండగ్రామంలో ఇటీవల సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు సదరు నేతకు ప్రోటోకాల్ తో గౌరవించారు. ఆయన చేతుల మీదుగా సబ్సిడీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని వ్యవసాయ శాఖ అధికారులు నిర్వహించి విమర్శలకు గురయ్యారు. అదే కోవలో తాజాగా జిల్లా విద్యాశాఖ కొనసాగిందని చెప్పవచ్చు.అయితే ఈ వ్యవహారం తమకు తెలియదని పిఈటిలు కొట్టి పారేస్తున్నారు.

జాతీయస్థాయిలో రాణించాలి

ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి గోవింద రాజులు మాట్లాడుతూ నారాయణపేట జిల్లా చదువులతో పాటు ఆటలలో సైతం ప్రస్తుతం ముందు ఉన్నామని పేర్కొన్నారు.జిల్లా కలెక్టర్ ప్రోద్బలంతో జిల్లాలో రెజ్లింగ్ కు ప్రత్యేక కోచింగ్ నిర్వహిస్తున్నామని,రెజ్లింగ్ ఆటలో పాలమూరు జిల్లా తరుపున నారాయణపేట జిల్లా క్రీడాకారులు నాలుగు గోల్డ్,నాలుగు సిల్వర్ మెడల్స్ సాధించి మన జిల్లా పేరు నిలబెట్టారన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ జి ఎఫ్ జిల్లా సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, కానుకుర్తి గ్రామ సర్పంచు ఎన్.నారాయణ,ఉపసర్పంచ్ యశోద,దామరదిద్ద సింగిల్ విండో చైర్మన్ ఈదప్ప, మండల విద్యాశాఖ అధికారి సురేష్,విద్యాశాఖ కార్యాలయ అధికారులు నాగార్జున రెడ్డి,విద్యాసాగర్, యాదయ్య,సంగీత,ఎస్ జి ఎఫ్ మహబూబ్ నగర్ జిల్లా సెక్రటరీ వేణుగోపాల్,రెజ్లింగ్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు నర్సిములు,మండలంలోని సర్పంచులు,వ్యాయామ ఉపాధ్యాయులు వెంకటప్ప, రామకృష్ణ రెడ్డి,బాలరాజ్ గౌడ్,రవి కుమార్, నెల్సన్, సాయినాథ్,బీరప్ప,నర్సిం హారెడ్డి,బాలరాజు ,నర్సింహారెడ్డి,కోచ్ శ్రీనివాస్,రాజేష్, బస్వరాజు,మండలంలోని వివిధ పార్టీల నాయకులు, కానుకుర్తి గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్

- బతుకమ్మ వేడుకల ఫొటోలు, వీడియోలతో విస్తృత ప్రచారం కల్పించాలి -సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాలి- పర్యాటక అభివృద్ధి పనులను స్థానిక ఇంజినీరింగ్ శాఖలతో త్వరితగతిన పూర్తి చేయాలి- రెండు వారాల్లోగా పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి- హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో ప్రైవేట్ పెట్టుబడులను ప్రోత్సహించాలి



హన్మకొండ (డి కె చాటింపు) తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను జిల్లాలో ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని పర్యాటక సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో బతుకమ్మ వేడుకల నిర్వహణతో పాటు పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల అమలు, నిధుల సమీకరణ, ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు. హనుమకొండ జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ చాహత్ బాజ్ పాయి ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ వీసీ లో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎ. వాణీ ప్రసాద్ మాట్లాడుతూ... బతుకమ్మ వేడుకలు గ్రామాలు, పట్టణాల్లో ప్రజల భాగస్వామ్యంతో పండుగ వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. మహిళలు, యువతులు పెద్ద సంఖ్యలో పాల్గొనేలా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. వేడుకలు జరిగే ప్రదేశాల్లో పారిశుధ్యం, తాగునీరు, విద్యుత్ దీపాలు, రవాణా, పార్కింగ్, భద్రత వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. బతుకమ్మ వేడుకలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను విస్తృతంగా సేకరించి, ప్రచారం చేయాలని కలెక్టర్లకు సూచించారు. బతుకమ్మ పండుగ విశిష్టత, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా కార్యక్రమాలను నిర్వహించడంతో పాటు ప్రజలకు చేరువయ్యే విధంగా ప్రచార కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు.

బతుకమ్మ పాటల ద్వారా

సూపర్ ఎల్‌నినోపై అవగాహన కల్పించాలి

ప్రస్తుత సూపర్ ఎల్‌నినో పరిస్థితుల నేపథ్యంలో వర్షపాతం, నీటి లభ్యత, వ్యవసాయం, పర్యావరణంపై ప్రభావాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. బతుకమ్మ పాటల పోటీలను నిర్వహించి, ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ, నీటిని పొదుపుగా వినియోగించడం వంటి అంశాలు పాటల్లో ప్రతిబింబించేలా కలెక్టర్లు చొరవ తీసుకోవాలన్నారు. ప్రస్తుత పరిస్థితులకు అనుగుణమైన సందేశాలతో పాటలు రూపొందించేలా ప్రజలను, మహిళా సంఘాలను, యువతను ప్రోత్సహించాలని తెలిపారు. బతుకమ్మ వేడుకలను సాంస్కృతిక కార్యక్రమాలకే పరిమితం చేయకుండా, ప్రజలకు అవసరమైన అవగాహన కల్పించే వేదికగా కూడా వినియోగించుకోవాలని సూచించారు.

పర్యాటక అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 56 పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులను జిల్లాలకు బదిలీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి తెలిపారు. ఇందులో నాగర్‌కర్నూల్ జిల్లాకు 20, ఖమ్మం జిల్లాకు 12, జగిత్యాల జిల్లాకు 2 ప్రాజెక్టులను అప్పగించినట్లు పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులను సంబంధిత స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో చేపట్టి, నిర్ణీత కాలవ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లాలకు బదిలీ చేసిన పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టుల వివరాలను పరిశీలించి, వాటి పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. స్థానిక ఇంజినీరింగ్ శాఖలకు పనుల బాధ్యతలు అప్పగించి, పనుల అమలు, నాణ్యత, పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలన్నారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత బిల్లులను పర్యాటక కార్పొరేషన్‌కు సమర్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలి

పర్యాటక అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన సమగ్ర ప్రాజెక్టు నివేదికలు (డీపీఆర్) సిద్ధం చేసేందుకు తగిన కార్యాచరణ రూపొందించాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. అవసరమైన చోట కన్సల్టెన్సీ సహకారం కూడా అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ప్రతి జిల్లాలో సంబంధిత ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ బాధ్యతలను రెండు వారాల్లోగా ఇంజినీరింగ్ శాఖలకు లేదా తగిన సంస్థలకు అప్పగించాలని ఆదేశించారు. ప్రాజెక్టు పరిధి, భూమి లభ్యత, నిర్మాణ పనులు, అవసరమైన మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, నిధుల సమీకరణ, అమలు గడువు వంటి అంశాలను డీపీఆర్‌లో స్పష్టంగా పొందుపరచాలని సూచించారు.

హరిత హోటళ్ల పూర్తికి పీపీపీ విధానంలో చర్యలు

కొన్ని జిల్లాల్లో హరిత హోటళ్ల నిర్మాణ పనులు పాక్షికంగా పూర్తయిన నేపథ్యంలో, మిగిలిన పనులను పూర్తి చేసి వాటిని నిర్వహణలోకి తీసుకువచ్చేందుకు ప్రభుత్వ–ప్రైవేట్ భాగస్వామ్య (పీపీపీ) విధానంలో అవకాశాలను పరిశీలిస్తున్నట్లు ఎ. వాణీ ప్రసాద్ తెలిపారు. ప్రైవేట్ పెట్టుబడిదారుల సహకారంతో నిర్మాణ పనులను పూర్తి చేసి, నిర్దిష్ట కాలం పాటు నిర్వహణ బాధ్యతలను వారికి అప్పగించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. జిల్లాలలో ఇటువంటి ప్రాజెక్టులకు ఆసక్తి చూపే ప్రైవేట్ పెట్టుబడిదారులు ఉంటే, జిల్లా స్థాయిలో వారిని గుర్తించి ఈ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధుల సహకారం కూడా తీసుకోవాలని సూచించారు.

నిధుల వనరులను పరిశీలించి పర్యాటక ప్రణాళిక రూపొందించాలి

ప్రతి జిల్లాలో పర్యాటక అభివృద్ధికి ఉన్న అవకాశాలను గుర్తించి, సమగ్ర ప్రణాళికతో పాటు ఆకర్షణీయమైన ప్రజెంటేషన్ సిద్ధం చేయాలని ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సూచించారు. జిల్లాలోని ప్రసిద్ధ పర్యాటక ప్రాంతాలు, చారిత్రక ప్రదేశాలు, ఆధ్యాత్మిక క్షేత్రాలు, ప్రకృతి అందాలు, వారసత్వ ప్రదేశాలను గుర్తించి, వాటి అభివృద్ధికి అవసరమైన భూమి, మౌలిక సదుపాయాలు, అంచనా వ్యయం, అమలు విధానం, పర్యాటకుల సౌకర్యాలను ప్రణాళికలో పొందుపరచాలన్నారు. పర్యాటక అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వ నిధులు, కేంద్ర ప్రభుత్వ పథకాలు, స్వచ్ఛంద సంస్థల సహకారం, ప్రైవేట్ పెట్టుబడులు వంటి అన్ని అవకాశాలను పరిశీలించాలని తెలిపారు. ముఖ్యంగా స్వదేశ్ దర్శన్ పర్యాటక అభివృద్ధి కార్యక్రమం కింద జిల్లాకు అనువైన ప్రాజెక్టులను గుర్తించి, నిధులు సమకూర్చుకునేందుకు అవసరమైన ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. పర్యాటక ప్రాంతాల్లో రహదారులు, తాగునీరు, విద్యుత్, పారిశుధ్యం, మరుగుదొడ్లు, పార్కింగ్, వసతి, సమాచార బోర్డులు, భద్రత వంటి సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. స్థానిక కళలు, హస్తకళలు, స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు, స్థానిక ఆహార సంస్కృతిని పర్యాటకంతో అనుసంధానం చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెంపొందించాలన్నారు.

ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో భద్రతా సిబ్బందిని నియమించాలి

రాష్ట్రంలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎ. వాణీ ప్రసాద్ సూచించారు. ఈ మేరకు జిల్లాలకు పంపిన పర్యాటక ప్రాంతాల జాబితాను పరిశీలించి, అవసరమైన ప్రాంతాల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో భద్రతా సిబ్బందిని నియమించే చర్యలు జిల్లా స్థాయిలో చేపట్టాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు సురక్షిత వాతావరణం కల్పించడంతో పాటు, సంబంధిత శాఖల సమన్వయంతో పర్యాటక సౌకర్యాలను మెరుగుపరచాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థ ల అదనపు కలెక్టర్ (ఇంచార్జి)శేషాద్రి, డి ఆర్డీ వో శ్రీను, ఏసీపీ ప్రశాంత్ రెడ్డి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు

కామినేని హాస్పిటల్ ఎన్ ఎస్ జి ఆధ్వర్యంలో మెగా హెల్త్ క్యాంప్

విజయవంతమైన మెడికల్ క్యాంప్



హైదరాబాద్, అక్టోబర్13, డీకే చాటింపు: -కామినేని హాస్పిటల్స్ ఎల్బీనగర్ సౌజన్యంతో నేషనల్ సెక్యూరిటీ గార్డ్ 42వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కామినేని హాస్పిటల్స్ , ఎన్.ఎస్.జి మరియు సేవ్ ఎర్త్ ఫౌండేషన్(సెఫ్ ఎన్జీఓ) సంయుక్త ఆధ్వర్యంలో చెర్లపటేల్ గూడ లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో మెగా హెల్త్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కర్నల్ జయరాజ్ సింగ్ మీనా గ్రూప్ కమాండర్ 28 స్పెషల్ కాంపోజిట్ గ్రూప్ ఎన్ ఎస్ జి, మేజర్ హరీష్ తక్ టీమ్ కమాండర్ మెడికల్ ఆఫీసర్, కామినేని హాస్పిటల్స్ గ్రూప్ హెడ్ కె సత్యనారాయణ, తలసేమియా కో ఆర్డినేటర్ సేవారత్న అవార్డ్ గ్రహీత డాక్టర్ టి సురేందర్, అమర్ షేక్ అసిస్టెంట్ కమాండర్ 1, భూపేందర్ సింగ్ నరూక అసిస్టెంట్ కమాండర్ 1, గ్రామ సర్పంచ్ గణేశ్, సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, సేవ్ ఎర్త్ ఫౌండేషన్ సాంకేతిక సంచాలకులు నీలం సురేష్, విక్రమ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు. 172మందికి ఉచిత వైద్య సేవలు అందించడం జరిగిందని కామినేని వైద్య బృందం, సిబ్బంది తెలియజేశారు.

దేవి నవరాత్రుల సందర్భంగా స్వాములకు అన్నదానం



నిజామాబాద్‌ప్రతినిధి అక్టోబర్ 13 (డీకే చాటింపు): నిజామాబాద్ నగరంలోని మహాలక్ష్మి నగర్‌లో విశ్రాంత ఉద్యోగి శ్రీహరి స్వామి ఆధ్వర్యంలో దేవి దీక్షలో ఉన్న స్వాములకు మంగళవారం అన్నదానం చేశారు. ప్రతి సంవత్సరం దేవినవరాత్రులు గృహంలో దీక్షతో నిర్వహి స్తామని అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా అందరిపై ఉండాలని కోరుతూ ఒకరోజు స్వాముల కుఅన్నదానం ప్రతిఏటా చేస్తున్నట్లు స్వామి వివరించారు.

పులివెందులలో మారుతోన్న సీన్

కడప: పులివెందుల అంటే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తిరుగులేని కోట.అక్కడ ఏ గొడవలు జరిగినా, రాజకీయ ఘర్షణలు చోటుచేసుకున్నా అది కేవలం వైసీపీలోని అంతర్గత వర్గాల మధ్యనే సాగేది. ప్రత్యర్థి పార్టీల ఉనికి నామమాత్రంగానే ఉండటంతో, నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ చెప్పిందే వేదంగా చెల్లుబాటు అయ్యేది. దశాబ్దాలుగా ఏకఛత్రాధిపత్యం చలాయించిన వైసీపీ నాయకులు ఇప్పుడు సైలెంట్ కావడం, చాలామంది దారి చూసుకోవడం లేదా పక్కకు తప్పుకోవడంతో అక్కడ వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో అడుగంటిపోతోంది.వైసీపీ ఓటమితో ఉత్పన్నమైన ఖాళీని భర్తీ చేస్తూ పులివెందులలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీయే ప్రధాన శక్తిగా అవతరించింది.

రాజకీయాలలో కులాల పట్టింపులు



ఏలూరు, : ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహించడానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. సహజంగానే ఏపీ రాజకీయాలలో కులాల పట్టింపులు ఎక్కువగా ఉంటాయి. ఎన్నికల సమయంలో ఇవి ఎక్కువ ప్రభావం చూపిస్తుంటాయి.2024 లో జరిగిన ఎన్నికల్లో ఏపీ రాష్ట్రంలో జనసేన, బిజెపి, టిడిపి కలిసి పోటీ చేశాయి. కూటమిగా ఏర్పడి అధికారాన్ని దక్కించుకున్నాయి. మూడు పార్టీలకు కూటమి ప్రభుత్వంలో సముచిత ప్రాధాన్యం లభించింది. ముఖ్యమంత్రిగా చంద్రబాబు వ్యవహరిస్తున్నారు. ఏపీ అభివృద్ధి కోసం తీవ్రంగా శ్రమిస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో మూడు పార్టీలకు తన ప్రాధాన్యం దక్కే విధంగా ఆయన అడుగులు వేస్తున్నారు.మూడు పార్టీల అధినాయకులు ఎన్నికల్లో సముచిత ప్రాధాన్యం ఉండే విధంగా ఆలోచనలు చేస్తుంటే క్షేత్రస్థాయిలో పరిస్థితి మరో విధంగా ఉంది. కొంతమంది ఎమ్మెల్యేలు.. మిగతా నాయకులు వేరే విధంగా వ్యవహరిస్తున్నారు. వైసిపికి లాభం చేకూర్చే విధంగా మాట్లాడుతున్నారు. సహజంగానే ఇలాంటి అవకాశం కోసం వైసిపి ఎదురుచూస్తూ ఉంటుంది. పైగా ఆ పార్టీ చేతిలో మీడియా ఉంది. అందువల్లే జనసేన, టిడిపి, బిజెపి లో దిగువ స్థాయి నాయకుల అసంతృప్తి వ్యాఖ్యలకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తూ ఉంది. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో నాయకులు చులకన అవుతారు. కానీ ఆ విషయం కూటమిలోని పార్టీల కిందిస్థాయి నాయకులకు అర్థం కావడం లేదు.తాజాగా జనసేన తాడేపల్లిగూడెం ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ స్థానిక ఎన్నికల నేపథ్యంలో సంచలన వ్యాఖ్యలు చేశారు. జనసేన గెలిచిన చోట టిడిపి వాళ్ళను గౌరవిస్తున్నామని.. టిడిపి వాళ్ళు గెలిచిన చోట జనసేన నాయకులను గౌరవించడం లేదని.. ఈ సమస్య మీద నేరుగా ఒకే చంద్రబాబు.. పవన్ కళ్యాణ్ తో మాట్లాడుతామని శ్రీనివాస్ వ్యాఖ్యలు చేశారు. గడచిన కొంతకాలంగా కార్యకర్తల బాధ చూశామని.. ఇకపై వారు బాధపడకుండా చూసుకుంటామని శ్రీనివాస్ పేర్కొన్నారు. కార్యకర్తల ప్రవర్తన ఆధారంగా టికెట్లు కేటాయిస్తామని.. స్థానిక ఎన్నికల్లో గెలిపించుకునే బాధ్యతను భుజాలకు ఎత్తుకుంటామని శ్రీనివాస్ హామీ ఇచ్చారు.ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ ఇటువంటి వ్యాఖ్యలను అంతర్గతంగా చేసుకోవాలి. సాధారణంగా ఒక కుటుంబంలో ఎన్నో సమస్యలు ఉంటాయి.. సానుకూల ధోరణిలో మాట్లాడుతూ ఉంటే ఆ సమస్యలు పరిష్కారం అవుతూ ఉంటాయి. కూటమిగా ఉన్న మూడు పార్టీలలో కూడా సమస్యలు లేవని కాదు. కాకపోతే వాటిని సానుకూల దృక్పథంతో చర్చించుకుంటే బాగుంటుంది. అలాకాకుండా ఇలా అసంతృప్తి వ్యక్తం చేస్తుంటే సమస్యలు వెలుగు చూస్తూనే ఉంటాయి. ఇక్కడ జనసేన నాయకులకు టిడిపి ఎమ్మెల్యేలు గౌరవం ఇవ్వాలి. వాళ్ల సమస్యలను పరిష్కరించుకోవాలి. ఏదైనా ఉంటే కలిసి మాట్లాడుకోవాలి. అలాకాకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే మొదటికే మోసం వస్తుంది. స్థానిక ఎన్నికల సమయంలో ఇటువంటి ధోరణి కొనసాగిస్తే కూటమికి మొదటికే మోసం వస్తుంది.

వైసీపీకి భీమిలి టెన్షన్



విశాఖపట్టణం, : భీమిలి వైసీపీ ఇంచార్జ్ మజ్జి శ్రీనివాసరావు ఆ పార్టీని వీడటం పొలిటికల్ ఈక్వేషన్స్‌ను మార్చేస్తుంది. గ్రేటర్ విశాఖ పరిధిలో ఉన్న భీమిలి రాజకీయంగా చాలా ప్రాముఖ్యత ఉన్న నియోజకవర్గం. ఈ సెగ్మెంట్‌లో పట్టు పెంచుకోవాలని వైసీపీ ఆవిర్భావం నుంచి ఎన్నో ప్రయోగాలు చేస్తూ వస్తుంది. ఒక్క 2019లో పార్టీ వేవ్ వచ్చినప్పుడు మినహా.. 2014, 2024లో రెండుసార్లు ఫ్యాన్ పార్టీ ఇక్కడ ఓడిపోయింది. అయితే ఇప్పుడు చిన్న శ్రీను తర్వాత భీమిలిలో వైసీపీకి పెద్దదిక్కెవరు అనేది బిగ్ క్వశ్చన్ మార్క్‌గా మారింది. పార్టీ, క్యాడర్ లీడర్లను ముందుండి నడిపించడమే కాకుండా..చిన్న శ్రీను ప్లేస్‌ను రీప్లేస్ చేసే లీడర్ ఎవరు.? మళ్లీ కొత్త నేతను తెరపైకి తెస్తారా.? విశాఖ, అనకాపల్లి జిల్లాల్లో ఏదో ఒక నియోజకవర్గ ఇంచార్జ్‌ను వైసీపీ అధిష్టానం భీమిలికి షిఫ్ట్ చేస్తుందా అనేది చర్చనీయాంశంగా మారింది.కొత్త చట్టాలను పరిశీలించండివిశాఖ జిల్లా భీమిలి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది. టీడీపీ ఆవిర్భవించిన తర్వాత ఇప్పటిదాకా పది సార్లు అసెంబ్లీ ఎన్నికలు జరిగితే భీమిలిలో టీడీపీ ఏడు సార్లు గెలిచింది. కాంగ్రెస్ ప్రజారాజ్యం, వైసీపీ ఒక్కోసారి గెలిచాయి. ఇక భీమిలిలో 2019లో వైసీపీ గెలిచినా రాజకీయంగా పట్టు సాధించలేకపోయింది. మూడు వర్గాలు ఆరు గ్రూపులు అన్నట్లుగా అంతర్గత కుమ్ములాటలతో సరిపెట్టారు. మరోవైపు భీమిలీ వైసీపీ నాయకత్వ బాధ్యతలు ఎవరికి ఇచ్చినా వారు తప్పుకోవడం నెగెటివ్ సెంటిమెంట్‌గా టాక్ నడుస్తోంది. దాంతో విశాఖ జిల్లాలో రాజకీయంగా ఎంతో కీలకమైన ఈ నియోజకవర్గంలో వైసీపీ ఇప్పుడు అయోమయంలో పడిపోయినట్లు అవుతోంది.భీమిలి ఇంచార్జ్‌గా 2024 డిసెంబర్‌లో చిన్న శ్రీనుకు బాధ్యతలు అప్పగించింది వైసీపీ అధినాయకత్వం. దాదాపుగా రెండేళ్ల పాటు ఆయన పార్టీ బాధ్యతలను చూస్తూ వచ్చారు. అంగబలం అర్ధ బలం ఉండటంతో పాటు బలమైన కాపు సామాజిక వర్గానికి చెందిన నేత కావడంతో ఆయన భీమిలిలో వైసీపీని పటిష్టం చేసేందుకు ఎంతో కొంత శ్రమించారు. ఆయనే 2029 ఎన్నికల్లో భీమిలి నుంచి ఎమ్మెల్యేగా వైసీపీ తరపున చేస్తారని అంతా అనుకున్నారు. కానీ స్థానిక ఎన్నికల ముందే ఆయన సడెన్‌గా ఫ్యాన్ నీడ నుంచి బయటకు వచ్చి సైకిలెక్కేశారు. దాంతో లోకల్ ఫైట్ దూసుకొస్తున్న వేళ వైసీపీ ఇక్కడ నాయకత్వ లేమితో సతమతమవుతోంది. వైసీపీ గడచిన మూడు ఎన్నికల్లో ఇద్దరికి ఎమ్మెల్యే టికెట్లు ఇచ్చింది. అందులో 2014లో వైసీపీ నుంచి పోటీ చేసిన కర్రి రాము అయితే అప్పట్లో ఓడిపోగానే వైసీపీకి రాజీనామా చేశారు.రాజకీయ వార్తలు చదవండి2019 ఎన్నికల ముందు వైసీపీలో చేరిన అవంతి శ్రీనివాస్ భీమిలి నుంచి పోటీ చేసి గెలిచి మంత్రి అయ్యారు. 2024 ఎన్నికల్లో కూడా ఆయనే పోటీ చేశారు. తీరా ఓటమి చెందగానే పార్టీకి రాజీనామా చేశారు. ఆయన ప్లేస్‌లో చిన్న శ్రీనును ఇంచార్జ్‌గా పెడితే..సరిగ్గా స్థానిక ఎన్నికల వేళ ఆయన సైకిల్ ఎక్కేయడంతో వైసీపీ క్యాడర్ ఆందోళన చెందుతోంది. లోకల్ బాడీస్‌లో ఏకగ్రీవాలు జరగనిచ్చే ముచ్చటే లేదని వైసీపీ అంటోంది. కానీ భీమిలీ సీటులో ఆ పార్టీకి ఇంచార్జే లేడు. ఒకవేళ ఇప్పటికిప్పుడు ఎవరిని తెచ్చిపెట్టినా కూడా ఆయన అందరికీ పరిచయం అయ్యేలోపే స్థానిక ఎన్నికల అయిపోతాయని అంటున్నారు.మరోవైపు మాజీ మంత్రి గంటా శ్రీనివాసరావు ఇక్కడ సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్నారు. ఆయన అన్ని విధాలుగా రాజకీయంగా పట్టు బిగించారు. దానికి తోడు భీమిలిలో జనసేన, టీడీపీ రెండూ కూడా బలంగా ఉన్నాయి. భీమిలి ఇంచార్జ్ విషయంలో వైసీపీ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి మరి

జగన్ మైండ్ గేమ్ స్టార్ట్...



నెల్లూరు, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఇస్తున్న పిలుపులు, వేస్తున్న పావులు తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ముఖ్యంగా మెగా డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయంటూ ఆయన సాగిస్తున్న సుదీర్ఘ పోరాటంలో.. అనూహ్యంగా అధికార కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీలను లక్ష్యంగా చేసుకోవడం పెద్ద ఎత్తున చర్చకు దారితీసింది. ప్రభుత్వం ఎన్ని రకాల వివరణలు ఇచ్చినా, గణాంకాలు ముందుంచినా డీఎస్సీపై తన ఆరోపణలకే కట్టుబడి ఉన్న జగన్.. ఈ క్రమంలో టీడీపీతో సాగుతున్న కూటమి నుంచి బీజేపీ, జనసేన తక్షణమే బయటకు రావాలి అని డిమాండ్ చేయడం వెనుక ఎలాంటి వ్యూహం ఉందనేది ఆసక్తికరంగా మారింది.గత కొన్నేళ్లుగా కేంద్రంలోని బీజేపీ పెద్దలతో జగన్‌కు ఉన్న సాన్నిహిత్యం బహిరంగ రహస్యమే. గతంలో వైఎస్ఆర్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు కానీ, ప్రతిపక్షంలోకి వచ్చాక కానీ ఆయన కేంద్ర ప్రభుత్వంపై లేదా ప్రధాని మోదీపై నేరుగా విమర్శలు చేసిన దాఖలాలు లేవు. అలాంటి జగన్, ఇప్పుడు టీడీపీ నేతృత్వంలోని కూటమి నుంచి బీజేపీ, జనసేన వైదొలగాలని గొంతు ఎత్తడం వెనుక ప్రధానంగా కూటమి ఐక్యతను దెబ్బతీసే పెద్ద వ్యూహం దాగి ఉందనేది పొలిటికల్ ఎనలిస్ట్‌ల ప్రాథమిక అంచనా. 2024 ఎన్నికల్లో మూడు పార్టీలు కలిసి పోటీ చేయడం వల్లే వైఎస్ఆర్‌సీపీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వచ్చింది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలు లేదా భవిష్యత్ సమరాల నాటికి ఈ బంధంలో చీలికలు తెస్తే తప్ప, రాజకీయంగా కోలుకోవడం కష్టమనే ఆలోచనతోనే జగన్ ఈ డిమాండ్‌ను తెరపైకి తెస్తున్నారని భావించవచ్చు.డీఎస్సీ వివాదాన్ని కేవలం విద్యాశాఖ , టీడీపీ ప్రభుత్వ వైఫల్యంగా మాత్రమే కాకుండా, మొత్తం కూటమి ప్రభుత్వ నైతిక వైఫల్యంగా చిత్రించేందుకు జగన్ ప్రయత్నిస్తున్నారు. డీఎస్సీలో అక్రమాలు జరిగాయని మండిపడుతున్న ఆయన, ఈ పాపంలో బీజేపీ, జనసేనలు కూడా భాగస్వాములు కాకూడదంటే వెంటనే బయటకు రావాలని నైతిక ఒత్తిడి పెంచే ప్రయత్నం చేస్తున్నారు. కూటమి భాగస్వామ్య పక్షాల్లో అంతర్గత అనుమానాలను, విభేదాలను రేకెత్తించడం ద్వారా టీడీపీని ఒంటరిని చేయాలనేది జగన్ వ్యూహంలో భాగం. ఇటీవల కార్రోచ్ కామెంట్స్, పోరాట వ్యూహాలపై జగన్ మాట్లాడిన తీరును చూస్తే.. ఇది కేవలం కూటమిని విచ్ఛిన్నం చేసే వ్యూహమే కాకుండా, రాబోయే రోజుల్లో కేంద్రంలోని బీజేపీపై కూడా పూర్తిస్థాయిలో వ్యతిరేక గళం విప్పడానికి ఇస్తున్న ముందస్తు సంకేతామా అనే కోణంలోనూ విశ్లేషణలు సాగుతున్నాయి. ఇన్నాళ్లూ కేంద్రంతో మైత్రిని కొనసాగించినా తమకు దక్కిన రాజకీయ ప్రయోజనం ఏమీ లేదని, ప్రతిపక్షంగా నిలదొక్కుకోవాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఒకేసారి విరుచుకుపడటమే ఏకైక మార్గమని వైఎస్ఆర్‌సీపీ భావిస్తూ ఉండవచ్చు.ఈ విమర్శలు ఫలిస్తాయా అంటే ఆచరణలో అది సాధ్యపడేలా కనిపించడం లేదు. పవన్ కల్యాణ్ నేతృత్వంలోని జనసేన, కేంద్రంలోని బీజేపీ నాయకత్వం టీడీపీతో అత్యంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తున్నాయి. జగన్ చేస్తున్న ఈ డిమాండ్లను కూటమి నేతలు తేలిగ్గా కొట్టిపారేస్తున్నారు. తన సొంత రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి, క్యాడర్‌లో ఉత్సాహం నింపడానికి జగన్ ఆడుతున్న మైండ్ గేమ్ ఇది తప్ప, దీనివల్ల కూటమి విచ్ఛిన్నమయ్యే అవకాశం శూన్యమని అధికార పక్షం కౌంటర్ ఇస్తోంది. డీఎస్సీ అక్రమాల నెపంతో కూటమి పునాదులను కదిలించేందుకు జగన్ చేస్తున్న ఈ ప్రయత్నం ఏపీ రాజకీయాల్లో కొత్త సమీకరణాలకు దారితీస్తుందో లేక కేవలం ఒక రాజకీయ ప్రకటనగానే మిగిలిపోతుందో వేచి చూడాలి.

రెండేళ్ల పాలనకు రెఫరెండమేనా



విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సన్నాహాలు శరవేగంగా సాగుతుండటంతో, ఈ ఎన్నికల ఫలితాలు కూటమి ప్రభుత్వం సాధించిన రెండేళ్ల పాలనకు రెఫరెండం అవుతాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో సాగుతోంది. సర్వే ఏజెన్సీలు ఇచ్చే ప్రైవేటు సర్వేలు, ఒపీనియన్ పోల్స్ ఎన్ని వచ్చినా.. గ్రామ , నగర స్థాయిలో ఓటర్లు నేరుగా తమ ఓటు హక్కును వినియోగించుకునే ఈ ఎన్నికలే అసలైన ప్రజాభిప్రాయానికి నిలువెత్తు అద్దమని నమ్మడంలో సందేహం లేదు. అయితే, ఈ ఎన్నికలను బహిరంగంగా రెఫరెండం గా అంగీకరించేందుకు రాజకీయ పార్టీలు, ముఖ్యంగా అధికార పక్షం ముందుకు వస్తుందా లేదా అనేది అసలైన ప్రశ్న.సాధారణంగా ఏ రాష్ట్రంలోనైనా అధికారంలో ఉన్న పార్టీలు స్థానిక సంస్థల ఎన్నికలను తమ ప్రభుత్వ పాలనపై రెఫరెండం అని అధికారికంగా ప్రకటించడానికి ఇష్టపడవు. స్థానిక ఎన్నికల్లో కేవలం రాష్ట్రస్థాయి విధానాలు లేదా సంక్షేమ పథకాలే కాకుండా, స్థానిక అభ్యర్థి ఇమేజ్, కుల సమీకరణాలు, వ్యక్తిగత సంబంధాలు, ధనప్రవాహం వంటి అనేక హైపర్-లోకల్ అంశాలు ప్రభావం చూపుతాయి. ప్రభుత్వంపై ఎంత పాజిటివ్ వేవ్ ఉన్నప్పటికీ, స్థానికంగా ఎంపీటీసీ, సర్పంచ్ , కార్పొరేటర్ అభ్యర్థులపై ఉండే అసంతృప్తి వల్ల కూడా కొన్ని స్థానాలు చేజారే ప్రమాదం ఉంటుంది. అందుకే, అధికార కూటమి ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేసినప్పటికీ, దీనికి రెఫరెండం ముద్ర వేసి అనవసర రాజకీయ ప్రమాదాన్ని కొనితెచ్చుకోదు.మరోవైపు, ప్రైవేటు సర్వేల ను పక్కన పెడితే.. స్థానిక పోరులో వచ్చే ఫలితాలే అసలైన గ్రౌండ్ రియాలిటీని సూచిస్తాయి. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో వచ్చిన సంచలనాత్మక తీర్పు తర్వాత, కూటమి అమలు చేస్తున్న సూపర్ సిక్స్ హామీలు, పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్ పథకాలు , అమరావతి అభివృద్ధి వంటి పరిణామాలు ప్రజల్లో ఎంతవరకు సానుకూలతను నింపాయో ఈ ఎన్నికల ద్వారా స్పష్టమవుతుంది. గ్రామీణ ,పట్టణ ఓటర్లు కూటమి పాలన పట్ల సంతృప్తిగా ఉన్నారా లేదా అనేది బ్యాలెట్ బాక్సుల ద్వారా నిరూపితమవుతుంది. ఇక ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ ఈ రెఫరెండం వాదనను ఒక రాజకీయ ఆయుధంగా మార్చుకోవడానికి ప్రయత్నిస్తోంది. కూటమి ప్రభుత్వ వైఫల్యాలకు, హామీల నెరవేర్పులో జరుగుతున్న జాప్యానికి ఈ ఎన్నికలే కొలమానం అని ప్రచారం చేయడం ద్వారా ఓటర్లను తమవైపు తిప్పుకోవచ్చని భావిస్తోంది. అయితే, జగన్ పార్టీ నిజంగా ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, అధికార పార్టీకి కౌంటర్ ఇవ్వాలంటే కేవలం విమర్శలకే పరిమితం కాకుండా, ప్రతీ స్థానంలోనూ గట్టి పోటీని ఇచ్చి ఓటర్లలో నమ్మకాన్ని పునరుద్ధరించాల్సి ఉంటుంది.

ఇక అధికారంలో ఉన్న టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పరంగా చూస్తే, ఈ ఎన్నికలు కేవలం గెలుపోటములకే పరిమితం కాకుండా, మిత్రపక్షాల మధ్య సమన్వయం ఎంతవరకు బలపడిందో తేల్చే వేదికగా మారనున్నాయి. క్షేత్రస్థాయిలో వార్డులు, పంచాయతీల స్థాయిలో టిక్కెట్ల కేటాయింపులో పార్టీల మధ్య ఘర్షణలు రాకుండా చూసుకోవడం కూటమి పెద్దలకు సవాలుగా మారనుంది.కూటమి నేతలు స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు జరిపి భారీ విజయాన్ని సాధిస్తే, అది వైఎస్ఆర్‌సీపీ నైతిక ధైర్యాన్ని దెబ్బతీయడమే కాకుండా, కూటమి పాలనకు ప్రజల ఆమోదముద్ర పడినట్లే అవుతుంది. సాంకేతికంగా లేదా అధికారికంగా ఏ పార్టీ కూడా ఈ స్థానిక పోరును పాలనా రెఫరెండం అని ఒప్పుకోకపోయినా, రాజకీయ విశ్లేషకుల దృష్టిలో మరియు ప్రజల ఆలోచనల్లో ఇది కచ్చితంగా కూటమి ప్రభుత్వ పనితీరుకు వేసే గ్రేడింగ్ మార్కులే. ఈ ఎన్నికల ఫలితాలు రాబోయే 2029 సార్వత్రిక ఎన్నికలకు స్పష్టమైన పొలిటికల్ రోడ్‌మ్యాప్‌ను, మూడ్‌ను నిర్దేశిస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు

వైసీపీకి జీవన్మరణ సమస్య



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల నగారా మోగే సమయం దగ్గర పడుతున్న కొద్దీ ప్రతిపక్ష వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన ఒత్తిడికి, కంగారుకు గురవుతున్నట్లు స్పష్టమవుతోంది. సార్వత్రిక ఎన్నికల్లో ఎదురైన ఘోర పరాభవం నుంచి కోలుకోకముందే ఎదురవుతున్న స్థానిక పోరులో ఉనికి కాపాడుకోవడం ఆ పార్టీకి జీవన్మరణ సమస్యగా మారింది. ఈ క్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకత్వం శాంతియుత ప్రజాస్వామ్య పోరాటాలను ఎంచుకోవడానికి బదులుగా, రక్తాభిషేకాలు, నరుకుతాం, చంపుతాం వంటి తీవ్రమైన ఆవేశపూరిత వ్యాఖ్యలతో క్యాడర్‌ను రగల్చే ప్రయత్నం చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమవుతోంది.వైఎస్ఆర్‌సీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డితో పాటు ఆ పార్టీ ముఖ్య నేతలు వీధి పోరాటాల పేరిట ఇస్తున్న పిలుపులు, వాడుతున్న భాష క్షేత్రస్థాయి శ్రేణులను మరింత ఇరకాటంలో పడేస్తున్నాయి. గత ఐదేళ్ల పాలనలో నమోదైన అక్రమ కేసులు, అధికార మార్పిడి తర్వాత చోటుచేసుకున్న చట్టపరమైన పరిణామాలతో ఇప్పటికే వందలాది మంది వైఎస్ఆర్‌సీపీ కార్యకర్తలు, నాయకులు పోలీస్ స్టేషన్లు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇటువంటి సున్నితమైన సమయంలో తిరగబడండి, తెగబడండి అంటూ నాయకత్వం ఇచ్చే ఆవేశపూరిత ఉపన్యాసాలు క్యాడర్‌ను శాంతింపజేయడానికి బదులు, మరిన్ని కొత్త కేసుల్లోకి నెట్టివేసే ప్రమాదం ఉంది.ఈ తరహా ఆవేశపూరిత రాజకీయం వెనుక వైఎస్ఆర్‌సీపీ తీవ్రమైన కంగారు, అభద్రతా భావం దాగి ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధి, సంక్షేమంపై వేగంగా అడుగులు వేస్తుండటంతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఏకగ్రీవాలు లేదా ఏకపక్ష విజయాలు సాధిస్తే వైసీపీ క్యాడర్ పూర్తిగా ఖాళీ అయిపోతుందనే భయం ఆ పార్టీని వెంటాడుతోంది. ప్రజాదరణతో ఎన్నికలను ఎదుర్కోవడానికి తగినంత గ్రౌండ్ వర్క్ లేకపోవడంతో, ఘర్షణ పూరిత వాతావరణాన్ని లేదా సెంటిమెంట్‌ను రగల్చడం ద్వారా ఎన్నికలను వాయిదా వేయించడమో, లేదా వైలెంట్ నేరేటివ్‌తో ఉద్రిక్తతలు సృష్టించి ప్రభుత్వంపై వేధింపుల ముద్ర వేయడమో ఒకే ఒక్క మార్గంగా వైసీపీ ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఈ తీవ్రమైన వ్యాఖ్యలు పార్టీకి మైలేజ్ ఇవ్వడం కంటే తీవ్రమైన నష్టాన్ని కలిగిస్తున్నాయి. కేసుల్లో ఇరుక్కుని జైలుపాలు లేదా కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితి వస్తే, తమను ఆదుకోవడానికి ఏ సీనియర్ నాయకుడూ ముందుకు రాడనే నిజం ఇప్పటికే వైఎస్ఆర్‌సీపీ ద్వితీయ శ్రేణి నాయకత్వానికి అర్థమైంది. నాయకులు మైకుల ముందు ఆవేశంగా మాట్లాడి వెళ్ళిపోతారు, కానీ చట్టపరమైన పరిణామాలు అనుభవించాల్సింది క్షేత్రస్థాయి కార్యకర్తలే. దాంతో నాయకత్వం ఎంత రగిల్చినా, క్యాడర్ మాత్రం మళ్లీ కేసులు కొనితెచ్చుకోవడానికి సిద్ధంగా లేదు. అంతిమంగా, హింస లేదా రెచ్చగొట్టే రాజకీయాలను నమ్ముకోవడం ద్వారా ఏ పార్టీ కూడా సుదీర్ఘకాలం నిలబడలేదు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం అక్రమాలకు పాల్పడితే దానికి చట్టపరంగా, ప్రజాస్వామ్యయుతంగా ఎదురుతిరగాలి తప్ప.. నరకడం, చంపడం వంటి పదజాలంతో రాజకీయం చేస్తే పార్టీ మరింత బలహీనపడటంతో పాటు సామాన్య ప్రజల్లో మరింత వ్యతిరేకత మూటగట్టుకోవాల్సి వస్తుంది. స్థానిక పోరు వేళ వైఎస్ఆర్‌సీపీ అనుసరిస్తున్న ఈ ఆవేశపూరిత వ్యూహం పార్టీని పునరుద్ధరించడానికి బదులు, ఉన్న క్యాడర్‌ను కూడా దూరం చేసే ప్రమాదంలో పడేస్తోంది

స్థానిక పోరుకు జనసేన సిద్ధం



కాకినాడ, : ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి క్రమంగా రాజుకుంటోంది. అసెంబ్లీ ఎన్నికల్లో సాధించిన చారిత్రాత్మక విజయంతో అధికారంలోకి వచ్చిన జనసేన పార్టీ, రాబోయే స్థానిక పోరులోనూ అదే ఊపును కొనసాగించడమే లక్ష్యంగా కీలక కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగానే కీలక ఆత్మీయ సమావేశం నిర్వహించేందుకు సర్వం సిద్ధమైంది. క్షేత్రస్థాయి నుంచి పార్టీని మరింత బలోపేతం చేయడంతో పాటు ఎన్నికల వ్యూహాలకు పదును పెట్టడమే ఈ భేటీ ప్రధాన ఉద్దేశం.ఈ విస్తృత స్థాయి సమావేశానికి జనసేన ప్రజాప్రతినిధులు, కీలక నేతలు హాజరుకానున్నారు. పార్టీకి చెందిన మంత్రులు, పార్లమెంట్ సభ్యులు , శాసనసభ్యులు , ఎమ్మెల్సీలతో పాటు వివిధ కార్పొరేషన్లకు చైర్మన్లుగా ఎంపికైన నేతలకు పిలుపునిచ్చారు. వీటితో పాటు గత కష్టకాలంలో పార్టీ జెండాను మోసిన సీనియర్లకు సముచిత ప్రాధాన్యం ఇస్తూ.. 2019 సార్వత్రిక ఎన్నికలు, 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జనసేన తరఫున పోటీ చేసిన మాజీ అభ్యర్థులకు ప్రత్యేక ఆహ్వానాలు పంపారు.ఈ వేదికగా స్థానిక సంస్థల ఎన్నికల విధివిధానాలు, అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై రూపొందించిన 14 మంది సభ్యుల ప్రత్యేక కమిటీ సమగ్రంగా చర్చించనుంది. పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాలను, ఆయన సందేశాన్ని పార్టీ పీఏసీ చైర్మన్, మంత్రి నాదెండ్ల మనోహర్ నేతలకు కూలంకషంగా వివరించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార కూటమి తరఫున సీట్ల సర్దుబాటు, అనుసరించాల్సిన రాజకీయ వ్యూహాలు మరియు క్షేత్రస్థాయి సమన్వయంపై నాయకులకు స్పష్టమైన దిశానిర్దేశం చేయనున్నారు.గత ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి చెందినప్పటికీ నిలబడి పోరాడిన కేడర్‌కు స్థానిక సంస్థల్లో ప్రాధాన్యం కల్పించడంపై ఈ సమావేశంలో ప్రాథమిక నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. గల్లీ స్థాయి నుంచి క్షేత్రస్థాయి నాయకత్వాన్ని రీచార్జ్ చేస్తూ, గ్రామ పంచాయతీ నుంచి జిల్లా పరిషత్, మున్సిపల్ పీఠాల వరకు విజయం సాధించడమే లక్ష్యంగా జనసేన వ్యూహరచన చేస్తోంది. పంచాయతీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల్లో అభ్యర్థులను ఖరారు చేయడంపై ఈ ఆత్మీయ సమావేశం ఒక దిక్సూచిలా మారబోతోంది.జనసేన 21 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ, రెండు పార్లమెంటు స్థానాల్లో గత ఎన్నికల్లో గెలిచింది. అయితే ఈసారి మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లో వట్టున్న ప్రాంతాలను ఎంచుకోవాలని జనసేన భావిస్తుంది. అందుకు అవసరమైతే టీడీపీపై వత్తిడి కొంత పెంచి ఎన్నికలలో పోటీ చేయాలని నిర్ణయించింది. ఇప్పటికే పవన్ కల్యాణ్ వీరమహిళలు, జనసైనికులకు సంతృప్తి కలిగేలా వాటా ఉంటుందని, అదే సమయంలో కూటమి మధ్య మిత్రత్వాన్ని కొనసాగిస్తూనే అవసరమైన సీట్లను సాధించడం కోసం పట్టుబడతామని చెప్పింది. అయితే చూచాయగా అందిన సమాచారం మేరకు జనసేన ఏపీలోని పదహారు కార్పొరేషన్లలో ఐదింటిలో పోటీ చేయాలని భావిస్తుంది. ఇప్పటికే దీనిపై ఒక అభిప్రాయానికి వచ్చిన జనసేన కార్పొరేషన్ లలో తాము పోటీ చేసే స్థానాల విషయంలో క్లారిటీకి వచ్చినట్లు ఉందని పార్టీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, కాకినాడ, తిరుపతి, ఒంగోలు,. ఏలూరు కార్పొరేషన్లనలో మేయర్ పదవిని జనసేన కోరే అవకాశాలు కనిపిస్తున్నాయి. అయితే మొత్తం పదహారు కార్పొరేషన్లలలో ఐదు అంటే ఎక్కువేనని టీడీపీ నేతలు అభిప్రాయపడుతున్నారు. విజయవాడ కార్పొరేషన్ ను వదులుకునేందుకు టీడీపీ సిద్ధంగా ఉండదు.

ఫామ్ హౌస్‌లో సగానికిపైగా స్వాధీనం!



మెదక్, హైదరాబాద్, : తెలంగాణ రాజకీయాల్లో గత దశాబ్ద కాలంగా అత్యంత ఆసక్తికరమైన, అంతకుమించి రహస్యమైన కేంద్రం ఏదైనా ఉందంటే అది సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫామ్‌హౌస్. ప్రారంభంలో కొద్దిపాటి ఎకరాల విస్తీర్ణంలో, కేవలం రెండు అంతస్తుల సాధారణ గెస్ట్‌హౌస్‌తో మొదలైన ఈ వ్యవసాయ క్షేత్రం.. కాలక్రమేణా వేల మీటర్ల పొడవాటి ప్రహరీ గోడలు, పటిష్టమైన నిఘా వ్యవస్థ, అత్యాధునిక రాజభవన సముదాయాలతో ఒక అభేద్యమైన కోటలా రూపాంతరం చెందింది. పార్టీలో సీనియర్ మంత్రులు, ఎమ్మెల్యేలకు సైతం కేవలం ప్రవేశ ద్వారం వద్ద నిర్మించిన షెడ్డు వరకే అనుమతి ఉంటుంది. లోపల కనుచూపు మేరలో విస్తరించి ఉన్న ఆకుపచ్చని తోటలు, నిర్మాణాల లోగుట్టు సొంత పార్టీ శ్రేణులకు కూడా చిక్కేది కాదన్నది బహిరంగ సత్యం. పాలనా పగ్గాలు చేతిలో ఉన్నప్పుడు ఫామ్‌హౌస్ కేంద్రంగా సాగిన పాలన పై నిరంతరం ఎదురుదాడి చేసిన విపక్షాలకు, అది ఎప్పుడూ ఒక ఛేదించలేని రహస్య కేంద్రంగానే మిగిలిపోయింది.ఈ సుదీర్ఘ మిస్టరీకి తెరదించేలా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసెంబ్లీ సాక్షిగా విచారణాస్త్రం సంధించడంతో ఎర్రవల్లి కోట చుట్టూ ఉన్న పొగమంచు వీడబోతోంది. కేసీఆర్ వ్యవసాయ క్షేత్రం అసలు పరిమాణం ఎంత? అందులో కేసీఆర్ స్వయంగా కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేయించుకున్న భూమి ఎంత? కౌలు పేరిట చేజిక్కించుకున్నది ఎంత? బినామీల పేరిట చుట్టుపక్కల విస్తరించిన భూభాగం ఎంత? అన్న లెక్కలు తేల్చేందుకు ప్రభుత్వం రంగంలోకి దిగింది. ఫామ్‌హౌస్ పరిధి సుమారు 700 ఎకరాలకు పైగా విస్తరించి ఉందని, అందులోనే ఏకంగా 340 నుంచి 388 ఎకరాల మేర అసైన్డ్, ప్రభుత్వ భూమి కలిసిపోయి ఉందన్న రేవంత్ ఆరోపణలతో అధికార యంత్రాంగం సమగ్ర భూ సర్వేకు నడుం బిగించింది. జిల్లా కలెక్టర్, రెవెన్యూ విభాగాలకు 30 రోజుల స్పష్టమైన డెడ్‌లైన్ విధించడం ఈ విచారణ తీవ్రతను స్పష్టం చేస్తోంది.ఇది కేవలం ఒక రాజకీయ నాయకుడి ఆస్తిపాస్తుల పరిశీలన మాత్రమే కాదు. ల్యాండ్ సీలింగ్ చట్టం, ధరణి పోర్టల్ సమగ్రతపై జరుగుతున్న అతిపెద్ద న్యాయ-పరిపాలనా పరీక్ష. తెలంగాణ అగ్రికల్చర్ ల్యాండ్ సీలింగ్ చట్టం ప్రకారం ఒక కుటుంబ యూనిట్‌కు గరిష్ట పరిమితి ఉండగా, కేసీఆర్ కుటుంబం అధికారికంగానే దాదాపు 439 ఎకరాలను ఎలా కలిగి ఉందన్న సాంకేతిక చిక్కును కాంగ్రెస్ ప్రభుత్వం లేవనెత్తుతోంది. అంతేకాకుండా, గత ప్రభుత్వ హయాంలో ధరణి ద్వారా రికార్డులను నిషేధిత జాబితా నుంచి తొలగించారా? స్థానిక రైతుల వద్ద నుంచి తీసుకున్న భూములకు చట్టబద్ధమైన బదలాయింపులు జరిగాయా? లేక అధికార బలాన్ని అడ్డం పెట్టుకుని హద్దులు విస్తరించారా? అనే అంశాలపై డ్రోన్ సర్వేలు, పాత పహాణీల రికార్డులు పరిశీలిస్తే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూసే అవకాశముంది.ఒకవేళ విచారణలో ప్రభుత్వ, అసైన్డ్ భూముల ఆక్రమణ నిజమని తేలితే, వాటిని వెంటనే స్వాధీనం చేసుకుని దళిత, పేద వర్గాలకు పంచుతామన్న ప్రభుత్వ ప్రకటన బీఆర్ఎస్ అధినేతను ఆత్మరక్షణలోకి నెడుతుంది. ఇన్నాళ్లూ ప్రగతిశీల వ్యవసాయం , ఆధునిక సేద్యం పేరుతో ప్రచారం చేసుకున్న మోడల్ ఫామ్‌హౌస్ వెనుక అసలు కథ ఏమిటన్నది ఇప్పుడు అధికారిక డాక్యుమెంట్ల సాక్షిగా బట్టబయలు కానుంది. రేవంత్ ప్రభుత్వం వేసిన ఈ దూకుడు అడుగుతో, దశాబ్ద కాలంగా ఎవరికీ అంతుచిక్కని కేసీఆర్ ఫామ్‌హౌస్ రహస్యాలు ప్రజాక్షేత్రంలో బట్టబయలయ్యే ఘట్టం సమీపించినట్లే కనిపిస్తోంది.

రోడ్ల మీద గ్రీన్ ఈవీ బస్సు



తిరుపతి, : ఏపీఎస్ఆర్టీసీ కన్వేర్షన్ ఏసీ ఇంద్ర బస్సు రోడ్డెక్కింది. పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ పాత సూపర్ లగ్జరీ బస్సును విజయవాడలోని వర్క్‌షాప్‌లో విద్యుత్ బస్సుగా మార్చింది. విజయవాడతో పాటుగా తిరుపతిలో పలు దశల్లో ట్రయల్ రన్ నిర్వహించారు.. తాజాగా ఈ గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి నడిపింది.ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు ఉచిత బస్సు పథకం అమలవుతోంది.. దీంతో బస్సుల్లో ఆక్యుపెన్సీ పెరిగింది. ఈ కారణంగా అదనంగా బస్సులు అవసరమయ్యాయి.. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి విద్యుత్ బస్సులు విడతలవారీగా వస్తున్నాయి. కొత్త బస్సులతో పాటుగా ఏపీఎస్ఆర్టీసీ మరో వినూత్నమైన ఆలోచన చేసింది.. పాత బస్సుల్ని ఏసీ ఈవీ బస్సులుగా మారుస్తోంది. పాత సూపర్‌లగ్జరీ బస్సును పుణెకు చెందిన కల్యాణి పవర్‌ట్రైన్ లిమిటెడ్ సంస్థ తక్కువ ఖర్చుతో రెట్రోఫిట్మెంట్ ద్వారా గ్రీన్ ఇంద్ర ఏసీ విద్యుత్ బస్సుగా మార్చేశారు. ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకానికి అందుబాటులోకి తీసుకొచ్చారు.ఈ విద్యుత్ బస్సు రెండు నెలల క్రితం విజయవాడ నుంచి తిరుపతికి తీసుకొచ్చారు. అనంతరం బస్సుకు సంబంధించిన రిజిస్ట్రేషన్, రోడ్డు కన్వేర్షన్ సహా అవసరమైన అనుమతులు తీసుకున్నారు. జులై 24న ఈ బస్సును తిరుపతి నుంచి కాణిపాకం ట్రయల్ రన్ నిర్వహించారు.. ఆ తర్వాత బస్సును రెగ్యులర్ సర్వీసుగా ప్రారంభించాలని భావించారు. కానీ ప్రారంభోత్సవం వాయిదా పడుతూ వస్తోంది.. దీంతో ఆర్టీసీ అధికారులు ఈ బస్సు డిపోలో ఖాళీగా ఉంటుందని గమనించారు. ఇలా ఖాళీగా ఉంచే బదులు ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొస్తే మంచిదని భావించారు.ఈ నెల 16న కాణిపాకానికి ఈ బస్సు రెండు ట్రిప్పులు నడిచింది.. ఆ సమయంలో కొన్ని లోపాలు గుర్తించారు. ఈ నెల 17న ఈ బస్సును గ్యారేజీకి తీసుకెళ్లి లోపాలను సరిచేశారు. ఈ విద్యుత్ బస్సు మంగళవారం రోజు తిరుపతి నుంచి కాణిపాకానికి 22మంది ప్రయాణికులతో బయలదేరి వెళ్లింది. అనంతరం కాణిపాక నుంచి చిత్తూరు వెళ్లి అక్కడ అవసరమైన కొన్ని తనిఖీలు చేసిన తర్వాత మళ్లీ 20మంది ప్రయాణికులతో తిరుపతి చేరుకుంది. మొత్తం మీద ఏపీఎస్ఆర్టీసీ చేసిన ప్రయోగం విజయవంతం అయ్యింది.

శ్రీశైలం ఇవో ఆకస్మిక పరిశీలన

కార్యనిర్వహణాధికారి శ్రీనివాసరావు పలు ప్రదేశాలను ఆకస్మికంగా పరిశీలించారు. పాతాళగంగ స్నానఘట్టాలు, సిద్ధరామప్ప వాణిజ్య సముదాయం, పలు ప్రదేశాలలోని శౌచాలయాలు మొదలైనవాటిని కార్యనిర్వహణాధికారి పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారివారు మాట్లాడుతూ భక్తులు పాతాళగంగలో పుణ్యస్నానాలకు అధిక ప్రాధాన్యత ఇస్తారన్నారు. అందుకే పాతాళగంగ పరిసరాలను, పాతాళగంగమెట్లను, ఎప్పటికప్పుడు శుభ్రం చేయిస్తుండాలని పారిశుద్ధ్య విభాగపు అధికారులను ఆదేశించారు.అవసరం మేరకు పాతాళగంగ పరిసరాలలో మరియు మెట్ల మార్గంలో మరిన్ని విద్యుద్దీపాలను ఏర్పాటు చేయాలన్నారు.పాతాళగంగలో మరిన్ని సూచికబోర్డులను ఏర్పాటు చేయాలని శ్రీశైలప్రభ మరియు ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ బోర్డుల ఏర్పాటు శాశ్వత ప్రాతిపదికతో ఉండాలన్నారు. అదేవిధంగా పాతాళగంగలో ప్రమాదాలు జరగకుండా వుండేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా పాతాళగంగ నీటిమట్టాన్ని బట్టి ఎప్పటికప్పుడు బ్యారికేడింగును పరిశీలిస్తుండాలన్నారు. ప్రమాదాలు నిరోధించేందుకు ఏర్పాటు చేయబడిన ఈతనిపుణులు కూడా మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.పాతాళగంగలోని స్ట్రీలు దుస్తులు మార్చుకునే గదులకు మరియు శౌచాలయాలకు ఎప్పటికప్పుడు అవసరమైన మరమ్మతులు చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు.

మోడీ జీవితంలో అరుదైన రికార్డ్స్



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని దేశవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు నిర్వహించారు. వీటిలో మొదటిది ఢిల్లీతో సహా పలు రాష్ట్రాల్లో 'సేవా సంకల్ప అభియాన్' (సేవా సంకల్ప ఉద్యమం). ఈ సందర్భంగా రోడ్లు, మురుగునీటి పారుదల, విద్య, విద్యుత్ వంటి పలు ప్రాజెక్టులను ప్రారంభించి, శంకుస్థాపన చేశారు. అంతేకాకుండా ప్రధాని మోదీ పుట్టినరోజును పురస్కరించుకుని, ఢిల్లీలోని 'దర్భవాయి మార్గం' (కర్తవ్య మార్గం) వెంబడి 1.25 లక్షల ఆశీర్వాద దీపాలను వెలిగించారుప్రధాని మోదీ రాజకీయ జీవితం విషయానికి వస్తే, ఆయన అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత 2014 నుండి భారతదేశ ప్రధానమంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 2014లో లోక్‌సభ ఎన్నికలలో గెలిచి ఆయన తొలిసారి ప్రధానమంత్రి అయ్యారు. ఈ పరంపర ఇప్పటికీ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ప్రధాని మోదీకి చెందిన కొన్ని ముఖ్యమైన రికార్డులు, విజయాలను పరిశీలిద్దాం.

ప్రధాని మోదీకి చెందిన 5 పెద్ద రికార్డులు:

వరుసగా అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి రికార్డు: 2026 జూన్ 10న, ప్రధానమంత్రి మోదీ వరుసగా 4,399 రోజుల పాటు ప్రధానమంత్రిగా పనిచేసి, పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ 4,398 రోజుల రికార్డును అధిగమించారు. దీంతో ఆయన అత్యధిక కాలం పనిచేసిన ఎన్నికైన ప్రధానమంత్రి అయ్యారు.

ప్రభుత్వాధినేతగా సుదీర్ఘ పదవీకాలం: 7 అక్టోబర్ 2001న నరేంద్ర మోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. అప్పటి నుండి ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా, దేశ ప్రధానమంత్రిగా మొత్తం సుమారు 25 సంవత్సరాల పాటు ప్రభుత్వాధినేత పాత్రను పోషించారు.

వరుసగా మూడు లోక్‌సభ ఎన్నికలలో విజయం: 2014 నుండి నరేంద్ర మోదీ వరుసగా మూడు సార్వత్రిక ఎన్నికలలో తన పార్టీ, కూటమికి నాయకత్వం వహించారు. ఈ ఎన్నికల తరువాత ఆయన వరుసగా మూడవసారి కేంద్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. దీంతో లోక్‌సభలో ఆయనకు ఇది వరుసగా మూడవ విజయం.

గుజరాత్‌కు అత్యధిక కాలం ముఖ్యమంత్రిగా పనిచేసిన రికార్డు: నరేంద్ర మోదీ అక్టోబర్ 2001 నుండి మే 2014 వరకు గుజరాత్ ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఈ కాలంలో, ఆయన నాయకత్వంలో బీజేపీ రాష్ట్రంలో వరుస ఎన్నికల విజయాలను సాధించింది.

విదేశీ పురస్కారాల రికార్డు: ప్రధానమంత్రి మోదీ వివిధ దేశాల నుండి 30కి పైగా ప్రతిష్టాత్మక పురస్కారాలను అందుకున్నారు. విదేశాల నుండి ఒక భారత ప్రధానమంత్రికి లభించిన అత్యధిక విదేశీ పురస్కారాలు ఇవే. వీటిలో సియోల్ శాంతి బహుమతి, ఫిలిప్ కోట్లర్ ప్రెసిడెన్షియల్ అవార్డు, ఛాంపియన్స్ ఆఫ్ ది ఎర్త్ అవార్డు (ఆఫ్ఘనిస్తాన్ అత్యున్నత పౌర పురస్కారం), సౌదీ అరేబియా రెండవ అత్యున్నత పౌర పురస్కారం, ఈజిప్ట్ అత్యున్నత పౌర పురస్కారం వంటివి ఉన్నాయి.

ఏపీలో ఫ్రెండ్లీ పోటీ తప్పదా?



విజయవాడ: రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా?రాష్ట్ర స్థాయిలో తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కలిసి ఉమ్మడిగా అధికారంలో ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయికి వచ్చేసరికి స్థానిక సంస్థల ఎన్నికల సమీకరణాలు పూర్తిగా భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. అసెంబ్లీ , పార్లమెంట్ ఎన్నికల్లో సీట్ల సర్దుబాటు సాధ్యమైనప్పటికీ, గ్రామ పంచాయతీ, వార్డు, ఎంపీటీసీ స్థాయిల్లో ప్రతి గ్రామంలోనూ తరతరాలుగా ఉన్న స్థానిక వర్గ పోరాటాలు, వ్యక్తిగత పట్టు ఈ ప్రక్రియను సంక్లిష్టం చేస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి నాయకుడూ తన సొంత ఉనికిని కాపాడుకోవాలని భావించడం వల్ల పార్టీ అధిష్ఠానాల నిర్ణయాలకు లోబడి సీట్లను త్యాగం చేయడం క్షేత్రస్థాయి కేడర్‌కు కష్టతరంగా మారుతోంది.గ్రామ రాజకీయాల్లో దశాబ్దాలుగా ఉన్న స్థానిక ఆధిపత్య పోరాటాలు కూటమి ఐక్యతకు ప్రధాన పరీక్షగా మారాయి. ఒకే పంచాయతీ లేదా వార్డులో టీడీపీ, జనసేన పార్టీల నుంచి బలమైన నాయకులు ఉండటం వల్ల, ఏ ఒక్కరికి టికెట్ ఇచ్చినా రెండో వర్గంలో తీవ్ర అసంతృప్తి చెలరేగే అవకాశం ఉంది. గ్రామాల్లో తమ ఉనికి కోల్పోతే భవిష్యత్ రాజకీయ భవితవ్యం ప్రమాదంలో పడుతుందని కింది స్థాయి నాయకులు ఆందోళన చెందుతున్నారు. అధిష్ఠానం ఒత్తిడి తెచ్చినా స్థానికంగా సర్దుబాటు కావడం అసాధ్యమని భావించే ప్రాంతాల్లో స్వతంత్రులుగానైనా బరిలోకి దిగాలనే ధోరణి స్పష్టంగా కనిపిస్తోంది.అధికారికంగా ఒకే అభ్యర్థిని బలవంతంగా రుద్దడం కంటే స్నేహపూర్వక పోటీలు ఖాయంగా కనిపిస్తోంది. పంచాయతీ ఎన్నికలు పార్టీ చిహ్నాల ప్రాతిపదికన జరగకపోవడం కూడా క్షేత్రస్థాయి నాయకులకు తమ వ్యక్తిగత బలాన్ని నిరూపించుకునే అవకాశాన్ని కల్పిస్తుంది. రెండు కూటమి పార్టీల నేతలు బరిలో ఉన్నప్పటికీ, ప్రచారంలో హద్దులు దాటకుండా విపక్ష వైఎస్సార్‌సీపీకి మైలేజ్ రాకుండా చూసుకోవాల్సిన అవసరం కనిపిస్తోంది.కూటమి అధిష్ఠానానికి స్థానిక సమన్వయం అతిపెద్ద పరీక్షగా నిలవనుంది. సమన్వయ కమిటీల ద్వారా సర్దుబాటు ప్రక్రియను ముందస్తుగానే పూర్తి చేయడం, నామినేటెడ్ లేదా ఇతర స్థానిక పదవుల హామీలతో అసంతృప్త నేతలను బుజ్జగించడంపై నాయకత్వం దృష్టి సారించింది. కింది స్థాయిలో ఘర్షణ వాతావరణం ఏర్పడితే అది ప్రభుత్వంపై ఉన్న సానుకూలతను ప్రభావితం చేస్తుందనే భావనతో, ప్రతి నియోజకవర్గంలో మంత్రులు, ఎమ్మెల్యేలు నేరుగా రంగంలోకి దిగి సర్దుబాటు చేసే ప్రయత్నాలు గట్టిగా చేయాల్సి ఉంది.

11 రూపాయిల ఐవీసెట్ 235

ముంబై : రూ. 11 విలువైన ఐవీ సెట్‌ను రూ. 325కి విక్రయిస్తూ దాదాపు 2,800 శాతానికి పైగా లాభం దండుకోవడం.. రూ. 6.75ల సిరంజిలను రూ. 57.20కి విక్రయిస్తూ 747 శాతం మార్జిన్ వేయడం.. రూ. 40 విలువైన నెబ్యులైజర్ మాస్క్‌ను ఏకంగా రూ. 715కి విక్రయించడం.. ఇవన్నీ మహారాష్ట్ర ఫుడ్ అండ్ డ్రగ్స్ అడ్మినిస్ట్రేషన్ పరిధిలోని 'ప్రైస్ మానిటరింగ్ రీసోర్స్ యూనిట్' (నిర్వహించిన మార్కెట్ సర్వేలో వెలుగుచూసినగ్రహ్మాంతికర విషయాలు. ఆసుపత్రుల్లో చేరిన రోగుల నుంచి వైద్య పరికరాలు, కన్స్యూమబుల్స్ పేరిట ఏ స్థాయిలో లాభార్జన జరుగుతుందో ఈ నివేదిక స్పష్టం చేసింది.: హర్యానాకు చెందిన మెడిప్లస్ సంస్థ తయారు చేసిన 'మెడిప్యూజన్ ఐవీ సెట్' కొనుగోలు ధర రూ. 11.05 కాగా, దానికి ఓఖీఖ రూ. 325గా ముద్రించి ఏకంగా 2,841 శాతం మార్జిన్ దండుకుంటున్నారు లైఫ్‌లాంగ్ మెడిటెక్ సంస్థ తయారు చేసిన 10 ఎఫ్ సిరంజీ కొనుగోలు ధర రూ. 6.75 కాగా, దాన్ని రోగులకు రూ. 57.20కి విక్రయిస్తున్నారు .కెన్యులా, మాస్క్‌లు: రూ. 22.50 విలువైన ఐవీ కెన్యులాను రూ. 424కి, అలాగే రూ. 45 విలువైన నెబ్యులైజర్ మాస్క్ కిట్‌ను రూ. 652కి విక్రయిస్తున్నారు.ఇతర పరికరాలు: విన్‌జో హెల్త్‌కేర్, రోమ్‌సన్, రిబ్బెల్ వంటి సంస్థలు తయారు చేసే కథేటర్లు, నీడిల్స్ కొనుగోలు ధర కంటే 10 నుంచి 19 రెట్లు ఎక్కువ ధరకు అమ్ముడుపోతున్నాయి.ఈ అడ్డగోలు దోపిడీని మహారాష్ట్ర ఎఫ్‌డీఏ



కమిషనర్ తుకారామ్ ముండే తీవ్రంగా ఖండించారు. తయారీదారులు తమ ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్ ఖర్చులు, లాభాలను కలిపిన తర్వాతే ప్రాథమిక కొనుగోలు ధర నిర్ణయమవుతుందని, దానిపై మళ్ల ఇన్ని రెట్లు ధరలు పెంచడం నరికాదని ఆయన అభిప్రాయపడ్డారు.ఆసుపత్రి అత్యవసర చికిత్సలో ఉండే రోగులకు ఈ పరికరాల ధరలపై బేరమాడే అవకాశం ఉండదని, అందుకే డ్రగ్స్ ఆర్డర్ (ఆఖఆ) 2013 పరిధిలోకి ఈ మెడికల్ పరికరాలను తీసుకొచ్చి ధరలపై పరిమితి విధించాలని కోరుతూ కేంద్ర విలేఖర రసాయనాలు, ఫార్మాస్యూటికల్స్ శాఖ కార్యదర్శికి ఆయన లేఖ రాశారు. విధానపరమైన చర్యలు తీసుకోవడం ద్వారానే ప్రజలపై పడుతున్న ఈ తీవ్రమైన ఆర్థిక భారాన్ని తగ్గించవచ్చని స్పష్టం చేశారు.

డీలిమిటేషన్ బిల్లుతో కమలానికి గులాబీ పువ్వులు!



హైదరాబాద్ : ప్రస్తుతం ఉన్న నిష్పత్తి ప్రకారం డీ లిమిటేషన్ చేస్తే తాము మద్దతిస్తామని కేటీఆర్ ప్రకటించారు. గతంలో యాభై శాతం పార్ములా మెనుక కూడా పెద్ద కుట్ర ఉందని ఆరోపించిన ఆయన ఇప్పుడు.. అదే ప్రకారం చేస్తే నిష్పత్తి మారదు కాబట్టి మద్దతు ఇస్తామన్నట్లుగా ఢిల్లీలో మీడియాకు చెబుతున్నారు. అయితే బీజేపీతో మాత్రం పొత్తు ఉండదని చెబుతున్నారు. ఓ మీడియా సంస్థ చర్చా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.బీజేపీతో తమ పార్టీ ఎలాంటి పొత్తు పెట్టుకోదని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడినప్పటి నుంచి జరిగిన మూడు సార్వత్రిక ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ ఒంటరిగానే పోటీ చేసిందని, ఏ పార్టీతోనూ పొత్తు పెట్టుకోలేదని ఆయన గుర్తుచేశారు. తమ సిద్ధాంతం , వైఖరిలో ఎలాంటి మార్పు లేదని, భవిష్యత్తులో కూడా బీజేపీతో జతకట్టే ప్రసక్తే లేదని చెప్పుకొచ్చారు. కేసీఆర్ నాయకత్వాన్ని బీజేపీ వైపు నెట్టేస్తున్నారంటూ ఆయన సోదరి కల్వకుంట్ల కవిత చేసిన వ్యాఖ్యలపై గట్టిగా సమాధానమివ్వలేకపోయారు.కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ నిర్ణయాలకు అంశాలవారీగా మద్దతు ఇస్తున్నామని కేటీఆర్ వివరించారు. గతంలో జిఎస్టి, నోట్ల రద్దు వంటి అంశాల్లో బీజేపీకి మద్దతిచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ.. నోట్ల రద్దుకు మద్దతివ్వడం ఒక పొరపాటని, అనుభవాల నుంచి నేర్చుకుంటామని ఆయన వ్యాఖ్యానించారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 21 శాతం మేర ఓట్లు తొలగించారని , ఇందులో అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలోనే ఓట్ల తొలగింపు జరిగిందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. అనర్హుల పేరిట సరైన విధానం పాటించకుండా ఓట్లను తొలగించి ఉంటే, దానికి వ్యతిరేకంగా అవసరమైతే కోర్టులను కూడా ఆశ్రయించడానికి తమ పార్టీ వెనుకాడదని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ తీసుకునే ప్రజామోదయోగ్యమైన బిల్లులకు పార్లమెంట్‌లో ఉన్న తమ ముగ్గురు రాజ్యసభ ఎంపీల ద్వారా మద్దతు ఇస్తామని, కానీ రాష్ట్ర రాజకీయాల్లో మాత్రం ఆ పార్టీకి పూర్తి ప్రత్యర్థిగా ఒంటరిగానే పోరాడతామని కేటీఆర్ తమ విధానంగా చెబుతున్నారు. కానీ ఎన్నికల దగ్గరకు వచ్చే సరికి ఏం జరుగుతుందో చెప్పడం కష్టం. రాజకీయం లెక్క వేరు.

అమెరికాలో యువకుడు మృతి

అమెరికాలో ఉన్నత చదువుల కోసం వెళ్లిన హైదరాబాద్కు చెందిన ఓ యువకుడు అనూహ్య పరిస్థితుల్లో మృతి చెందడం కుటుంబ సభ్యులు, బంధువులను తీవ్ర విషాదంలో ముంచింది. మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో సంతోష్నగర్కు చెందిన మహమ్మద్ జాబేర్ హుస్సేన్ (27) మృతి చెందాడు. ఉన్నత విద్యను పూర్తిచేసుకుని అమెరికాలోనే ఉద్యోగం చేస్తున్న జాబేర్ భవిష్యత్తుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న సమయంలో

ఈ విషాద ఘటన చోటుచేసుకుంది. ముఖ్యంగా ఆగస్టులోనే టెక్సాస్లో వివాహం జరగడం, ఆ తర్వాత కొద్దిరోజులకే ఆయన మృతి చెందడంతో కుటుంబ సభ్యులు తీవ్రగ్రహ్మాంతికి గురయ్యారు. సంతోష్నగర్కు చెందిన జాబేర్ హుస్సేన్ విద్యాభ్యాసం లో మంచి ప్రతిభకనబరిచారు. సివిల్ ఇంజినీరింగ్ లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యంతో 2021లో అమెరికా వెళ్లారు. మాస్టర్స్ డిగ్రీ కోసం అమెరికాలో అడుగుపెట్టిన ఆయన తొలుత కనెక్టికట్లోని విద్యాసంస్థలో చదువును కొనసాగించారు.

అక్కడతన మాస్టర్స్ డిగ్రీని పూర్తి చేసిన అనంతరం ఉద్యోగ అవకాశాల కోసం ప్రయత్నించారు. అనంతరం మసాచుసెట్స్ రాష్ట్రంలోని లోవెల్ నగరంలో ఉద్యోగంలో చేరారు. చదువుతో పాటు వృత్తిపరంగా కూడా స్థిరపడేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఆయన జీవితం అనూహ్యంగా విషాదాంతమైంది.

భాగ్యనగరంలో నీటి కష్టాలు తప్పవా..?

హైదరాబాద్ : వర్షాకాలం ముగింపు దశకు చేరుకున్నా గ్రేటర్ హైదరాబాద్ వాసులను భూగర్భ జలాల సమస్య తీవ్రంగా వేధిస్తోంది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు నీటి వినియోగం భారీగా పెరగడంతో భూగర్భ జలాలు అట్టడుగు స్థాయికి పడిపోయాయి. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది ఆగస్టు నాటికి సగటు భూగర్భ జలమట్టం ఏకంగా 4.84 మీటర్లు పడిపోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది.భూగర్భ జలవనరుల శాఖ విశ్లేషణ ప్రకారం.. ఆగస్టు చివరి నాటికి గ్రేటర్ పరిధిలో సాధారణంగా 460 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 360 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదైంది.

ఇది సాధారణం కంటే 22 శాతం తక్కువ. వర్షపాతం లోటు కారణంగా నగరవాసులు తాగునీరు, ఇతర అవసరాల కోసం బోర్లపై ఎక్కువగా ఆధారపడ్డారు. ఈ రెట్టింపు ప్రభావంతో భూగర్భ జలాలు శరవేగంగా అడుగంటిపోయాయి. గతేడాది ఆగస్టులో సగటున 6.36 మీటర్ల లోతులో లభ్యమైన భూగర్భ జలాలు, ప్రస్తుతం 11.20 మీటర్ల లోతుకు పడిపోయాయి. నగరంలోని చాలా ప్రాంతాల్లో పరిస్థితి మరింత ఆందోళనకరంగా ఉంది. ముఖ్యంగా కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, అమీర్‌పేట్, బాచుపల్లి, శేరిలింగంపల్లి, దుండిగల్, రాజేంద్రనగర్, సరూర్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ వంటి కీలక మండలాల్లో భూగర్భ జలాలు 15 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు చేరాయి.

అభివృద్ధి అన్నిప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యం

-రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి : సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ : రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. తెలంగాణ ప్రజా పాలన దినోత్సవం సందర్భంగా 4 కోట్ల తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి గారు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల స్వేచ్ఛ, ఆత్మగౌరవం, హక్కుల కోసం పోరాడిన యోధులకు ఈ చారిత్రక సందర్భంగా ఘనంగా నివాళులు అర్పించారు. "అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉ ద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉ ండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ. నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని అన్నారు. 1948 న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే ను మనం "ప్రజా పాలన దినోత్సవం"గా జరుపుకుంటున్నాం. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం? వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నాం. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ. 2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ. 20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం. రైతు భరోసా కింద రూ. 36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం. నన్నాలకు క్వింటాల్కు రూ. 500 బోనస్ చెల్లించామని అన్నారు.తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ. 12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది. గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ. 60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్టు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం. ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించా మని అన్నారు. ప్రపంచంలోని అత్యుత్తమ విశ్వవిద్యాలయాల ఆఫ్షోర్ క్యాంపస్లను హైదరాబాద్కు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నాం. అమెరికాకు చెందిన నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీతో పాటు బ్రిటన్లోని 17 స్వతంత్ర విద్యా సంస్థల సమాఖ్య యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ ఆఫ్షోర్ క్యాంపస్ల ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశాయి. ఆరోగ్య రంగానికీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని



రూ. 5 లక్షల నుంచి రూ. 10 లక్షలకు పెంచాం. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా 5 లక్షల 19 వేల మందికి రూ. 2,526 కోట్ల సహాయం అందించాం. సామాన్యుడికి కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలనే లక్ష్యంతో గోషామహల్లో రూ. 2,700 కోట్లతో కొత్త ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం మొదలైంది. సనత్నగర్లో మర్రి చెన్నారెడ్డి టిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభించుకున్నాం. అల్వాల్, ఎల్బీనగర్ టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులను త్వరలో అందుబాటులోకి తీసుకొస్తాం. వరంగల్లో 2 వేల పడకలతో టిమ్స్ ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొస్తాం. తెలంగాణ ఉద్యమంలో యువత ముందుండి పోరాడింది. ఉద్యోగాలు, ఉపాధి అవకాశాల కోసం పోరాడింది. 72 వేలకుపైగా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలను పారదర్శకంగా పూర్తి చేశాం. గ్రూప్-1 నుంచి గ్రూప్-4 వరకు పరీక్షలను పారదర్శకంగా నిర్వహించాం. ఏఐతో ఉద్యోగాల స్వరూపం మారుతోంది. కొత్త నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. అందుకే నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశాం. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఐటీఐలను అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్లుగా అప్గ్రేడ్ చేసుకున్నామని అన్నారు. ప్రస్తుతం ఎల్నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. విద్యుత్ డిమాండ్ కూడా పెరిగింది. తాగునీరు, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా ముందస్తు ప్రణాళికలతో పనిచేస్తున్నాం. ఈ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజల నుంచి కూడా సహకారం ఆశిస్తున్నాం. వీబీ జీ రామ్ జీలో ఎక్కువ పని దినాలు కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

ధరలు పెంచేసిన హ్యుండాయ్ మోటార్...



ముడిసరుకుల ధరల భారం, గ్లోబల్ మార్కెట్లో పెరుగుతున్న నిర్వహ ణ ఖర్చుల సవాళ్ల మధ్య ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం 'హ్యుండా య్ మోటార్ ఇండియా' వాహనదారులకు బ్యాడ్న్యూస్ ప్రకటించింది. పెరుగుతున్న ఖర్చులను భరించేందుకు వచ్చే సెప్టెంబర్ నుండి తమ అన్ని వాహనాల ధరలను మోడల్, వేరియంట్ను బట్టి 1 శాతం వరకు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఈఏడాదిలోనే హ్యుండాయ్ మూడోసారి ధరలను పెంచడం గమ నార్హం.ఇప్పటికే కంపెనీ జనవరిలో 0.6 శాతం, 1శాతం (గరిష్టం గా రూ. 12,800 వరకు) పెంచింది. ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న భౌగోళిక-రాజకీయ ఒత్తిళ్లు, ఇంధన ధరల హెచ్చుతగ్గులు, రవాణా సమస్యల వల్ల పెరిగిన తయారీ వ్యయ భారాన్ని ఎక్కువ కాలం మోయలేక, కొంతభాగాన్ని కొనుగోలుదారులపై వేయక తప్పడం లేదని కంపెనీ స్పష్టం చేసింది. అయితే ఇది కేవలం హ్యుండాయ్ సమస్య మాత్రమే కాదని, ఇప్పటికే మారుతీ సుజుకి, టాటా మోటార్స్ కూడాకొన్ని నెలల్లో రెండుసార్లు ధరలను పెంచాయని పరిశ్రమ వర్గా లు పేర్కొన్నాయి. ఈ ఏడాదిలోనే హ్యుండాయ్ మూడోసారి ధరలను పెంచడం గమనార్హం. ఇప్పటికే కంపెనీ జనవరిలో 0.6శాతం, 1 శాతం (గరిష్టంగా రూ. 12,800 వరకు) పెంచింది. ప్రపంచవ్యాప్తంగానెలకొన్న భౌగోళిక-రాజకీయ ఒత్తిళ్లు, ఇంధన ధరల హెచ్చుతగ్గులు, రవాణా సమస్యల వల్ల పెరిగిన తయారీ వ్యయ భారాన్ని ఎక్కువ కాలం మోయలేక, కొంతభాగాన్ని కొనుగోలుదారు లపై వేయక తప్పడం లేదని కంపెనీ స్పష్టం చేసింది.

మీనాక్షి స్థానంలో ముకుల్ వాస్నిక్!



హైదరాబాద్, : తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్ఛార్జ్ మార్పు ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో తీవ్రంగా చర్చనీయాంశమవుతోంది. ప్రస్తుతం ఇన్ఛార్జ్గా కొనసాగుతున్న ఏఐసీసీ కార్యదర్శి మీనాక్షి నటరాజన్ స్టడీ టూర్ నిమిత్తం లండన్ వెళ్లనుండటం, రాబోయే దాదాపు పది నెలల పాటు అందుబాటులో ఉండే అవకాశం లేకపోవడంతో ఆ స్థానాన్ని భర్తీ చేయడం ఏఐసీసీ కి అత్యవసరంగా మారింది. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ప్రభుత్వం నడుపుతున్నప్పటికీ.. నిత్యం ఉద్భవిస్తున్న అంతర్గత విభేదాలు, వర్గపోరు, మరియు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని నూతన ఇన్ఛార్జ్ ఎంపికపై హైకమాండ్ తీవ్రంగా కసరత్తు చేస్తోంది.మీనాక్షి నటరాజన్ స్థానంలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, సీనియర్ దళిత నేత ముకుల్ వాస్నిక్ పేరు చాలా ప్రముఖంగా ప్రచారంలోకి వచ్చింది. మహారాష్ట్రకు చెందిన ముకుల్ వాస్నిక్ రాజ్యసభ సభ్యుడిగా, కేంద్ర మాజీ మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ అనుభవం కలిగిన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఎన్ఎస్యూఐ , యూత్ కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవంతో పాటు.. గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి అనేక సంక్లిష్ట రాష్ట్రాల్లో పార్టీ ఇన్ఛార్జ్గా ఎలాంటి వివాదాలు లేకుండా పని చేసిన ట్రాక్ రికార్డు ఆయనకుంది.తెలంగాణ వంటి రాజకీయంగా అత్యంత సున్నితమైన రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి ప్రస్తుతం ఒక ట్రబుల్ షూటర్ అవసరం ఉంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని వర్గానికి, అలాగే పార్టీలోని పాత కాంగ్రెస్ సీనియర్ నాయకులకు మధ్య నడుస్తున్న ఆధిపత్య పోరును సమర్థవంతంగా సద్దుమణిగేలా చేయడం కొత్త ఇన్ఛార్జ్కు మొదటి సవాలు. ముకుల్ వాస్నిక్కు తెలంగాణలోని దాదాపు అందరు సీనియర్ నాయకులతో మంచి వ్యక్తిగత సంబంధాలు ఉన్నందున, ఆయన సమన్వయకర్తగా ఉంటే ఇరు వర్గాలను సమానంగా కలుపుకొని పోగలరనే ఆలోచనలో అధిష్ఠానం ఉన్నట్లు తెలుస్తోంది. మరొక ప్రధానమైన అంశం.. పార్టీ మరియు ప్రభుత్వం మధ్య సరైన కమ్యూనికేషన్ లేకపోవడం. నామినేటెడ్ పదవుల భర్తీ, కార్పొరేషన్ ఛైర్మన్ల నియామకాలు, మరియు జిల్లా స్థాయిలో కేడర్కు తగిన ప్రాధాన్యత లభించడం లేదనే అసంతృప్తి పాత నాయకుల్లో బలంగా ఉంది. వివాదరహిత ఇమేజ్ కలిగిన వాస్నిక్ వంటి సీనియర్ నేత బాధ్యతలు చేపడితే, ప్రభుత్వ నిర్ణయాల్లో పార్టీ ప్రాధాన్యతలను సమతుల్యం చేస్తూ సంక్షోభాలను సునాయాసంగా నివారించే అవకాశం ఉంటుంది.

అంతేకాకుండా, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం సామాజిక న్యాయం, బిసి-దళిత అజెండాతో ముందుకు సాగుతున్న తరుణంలో.. జాతీయ స్థాయిలో సీనియర్ దళిత ముఖమైన ముకుల్ వాస్నిక్కు ఇన్ఛార్జ్ బాధ్యతలు అప్పగించడం ద్వారా సామాజికంగా కూడా పార్టీకి కలిసొచ్చే అంశంగా మారనుంది. రాబోయే గ్రేటర్ ఎన్నికల్లో పార్టీకి తిరుగులేని విజయం అందించాలంటే పక్కా రోడ్మ్యాప్, సీట్ల సర్దుబాటులో పారదర్శకత అవసరం. దీనికి వాస్నిక్ అనుభవం ఎంతగానో తోడ్పడుతుందని భావిస్తున్నారు. తెలంగాణ కాంగ్రెస్కు కొత్త శ్వాస ఊదేందుకు ఏఐసీసీ సిద్ధమవుతోంది. ముకుల్ వాస్నిక్ ఎంట్రీ ఖాయమైతే, రేవంత్ రెడ్డి నాయకత్వానికి, సీనియర్ల అసంతృప్తులకు మధ్య బలమైన వంతెనగా మారి పార్టీని స్థానిక పోరు వైపు విజయవంతంగా నడిపించడంలో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు.

కాంగ్రెస్‌కు రివర్స్ అవుతున్న అతి రాజకీయం



హైదరాబాద్, : రాజకీయాల్లో వ్యూహాత్మక పైచేయి సాధించడం ఎంత కళో, దక్కిన ఆ ఆధిక్యతను పదిలపరుచుకుంటూ నిలబెట్టుకోవడం అంతకంటే పెద్ద పరిపక్వత. ఎదుటి పక్షం వేసే ఎత్తులకు పైఎత్తులు వేసి ఇరుకున పెట్టినప్పుడు వచ్చే మైలేజీని హుందాగా మలుచుకోవాలి తప్ప, అత్యుత్సాహంతో అతి చేస్తే అది అంతిమంగా చెట్టుకొట్టి మీదేసుకున్న చందంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌తో సాగిస్తున్న తాజా ఘర్షణల పర్వంలో సరిగ్గా ఇదే జరుగుతోందన్న భావన వ్యక్తమవుతోంది. అసెంబ్లీ వేదికగా మొదలైన వివాదంలో బీఆర్ఎస్ స్వయంకృతాపరాధంతో ఇరుక్కుపోయి, కాంగ్రెస్‌కు అయాచితంగా భారీ పొలిటికల్ అడ్వాంటేజ్ దక్కినప్పటికీ.. ఆ తర్వాత సాగుతున్న పరిణామాలు ఆ పైచేయిని చేజేతులా పోగొట్టుకునే దిశగా సాగుతున్నాయి.శాసనసభ స్పీకర్ గద్దం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్ కుమార్ రెడ్డి చేసినట్లుగా వచ్చిన వ్యాఖ్యలను కాంగ్రెస్ పార్టీ చాలా తెలివిగా దళిత ఆత్మగౌరవ పోరాటంగా మలిచింది. ఒక రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత నేతను అవమానించారంటూ అధికార పక్షం సంధించిన అస్త్రం బీఆర్ఎస్‌ను పూర్తిగా ఆత్మరక్షణలోకి నెట్టింది. అసెంబ్లీలో 22 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సస్పెన్షన్, సభలో ఆమోదించిన తీర్మానాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వైపు దండోరా మోగిస్తూ సాగిన నిరసనలతో రాజకీయంగా రావాల్సినంత మైలేజ్ కాంగ్రెస్ ఖాతాలోకి చేరింది. అసెంబ్లీ గేట్ల వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు ప్రవర్తించిన తీరు, చొక్కాలు విప్పి చేసిన ఆందోళనలు ప్రజల్లో ఆ పార్టీకి తీవ్రమైన సెల్ఫ్ గోల్‌గా మారాయి. ఇక్కడితో ఆగి ఉంటే.. నైతికంగా, రాజకీయంగా కాంగ్రెస్ సంపూర్ణ విజయం సాధించి ఉండేది.కానీ, అసలు సమస్య ఇక్కడే మొదలైంది. వచ్చిన రాజకీయ పైచేయిని కాపాడుకోవాల్సింది పోయి.. వ్యవహారాన్ని సాగదీసి తెగేదాకా లాగడమే కాంగ్రెస్ వ్యూహకర్తల అతిపెద్ద వైఫల్యంగా కనిపిస్తోంది. సాధారణంగా సభా ప్రాంగణంలో జరిగే నిరసనలు, వాగ్వాదాలను రాజకీయంగా ఎదుర్కోవాలి లేదా ప్రివిలేజ్ కమిటీలు, చైర్మన్, స్పీకర్ విచారణల పరిధిలో క్రమశిక్షణా చర్యలతో ముగించాలి. కానీ ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేయించి, ఇద్దరు ఎమ్మెల్సీలను తెల్లవారుజామునే అరెస్ట్ చేయించడం.. కేటీఆర్, హరీశ్‌రావు సహా ముఖ్య నేతలపై , పోలీసులతో ఫిర్యాదులు చేయించి కేసులు బనాయించడం ద్వారా వ్యవహారం అతి రాజకీయ వగ గా మారిపోయింది.ఒక దశ దాటిన తర్వాత చట్టపరమైన అతి దూకుడు ఎప్పుడూ ఎదురుదెబ్బే కొడుతుంది. అసెంబ్లీ ముట్టడి వెనుక పెద్ద కుట్ర ఉందని, పోలీసులను ఉద్దేశపూర్వకంగా కాలర్లు పట్టుకుని తోసేశారని కేసులు నమోదు చేసి కోర్టులు, రిమాండ్లు అంటూ ముందుకు వెళ్లడం వల్ల.. సహజంగానే ప్రజాక్షేత్రంలో బాధితులెవరో, వేధిస్తున్నదెవరో అనే సరిహద్దులు చెదిరిపోతాయి. రాజకీయాల్లో ప్రత్యర్థి తప్పు చేసినప్పుడు ఆ తప్పును ఎత్తిచూపి ప్రజా క్షేత్రంలో దోషిగా నిలబెట్టడం వరకే పరిమితం కావాలి. అంతేకానీ, అదే తప్పును సాకుగా తీసుకుని పోలీసు వ్యవస్థను ప్రయోగించి కక్షసాధింపులకు దిగితే.. ప్రజల్లో ప్రభుత్వ పరిపక్వతపై అనుమానాలు మొదలవుతాయి. తాము సాధించిన దళితవాద ఆధిపత్యాన్ని అరెస్టుల రూపంలో కరిగిపోకుండా కాపాడుకోవడంలో కాంగ్రెస్ నాయకత్వం విఫలమవుతోందన్నది కాదనలేని సత్యం.

తిరగబడ్డ గులాబీ వ్యూహం



హైదరాబాద్, : తెలంగాణ శాసనసభ వద్ద బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు జరిపిన నిరసన, ఆ తదనంతరం జరిగిన ఘర్షణల వ్యవహారం రాష్ట్ర రాజకీయాల్లో ఊహించని మలుపులు తిరుగుతోంది. చట్టసభల ప్రాంగణంలో ఆందోళనను తీవ్రంగా పరిగణించి, ప్రతిపక్షంపై రాజకీయ మైలేజ్ సాధించాలనే సంకల్పంతో కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా ముందుకు సాగింది. బీఆర్ఎస్ అగ్రనేతలపై కఠిన చట్టాల కింద కేసులు నమోదు చేయడం, చివరికి మాజీ మంత్రి కేటీఆర్ పిఏ మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేష్‌లను సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో విచారణ పేరుతో గంటల తరబడి హాజరుపరచడం వరకు వ్యవహారాన్ని తీసుకెళ్లారు. అయితే, ఈ పరిణామాలను విశ్లేషిస్తే.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతటి రాజకీయ ప్రయోజనాన్ని ఆశించిందో, అంతకంటే ఎక్కువ రాజకీయ ప్రతికూలతలను ఎదుర్కొనే ప్రమాదంలో పడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.ప్రజాప్రతినిధులపై నమోదు చేసిన తీవ్రమైన కేసులు, అలాగే విచారణ ప్రక్రియ శృతిమించడం కాంగ్రెస్‌కు ఇబ్బందికరంగా మారింది. బీఆర్ఎస్ నేతలను చట్టబద్ధంగా కట్టడి చేయాలనే ఉద్దేశం వ్యూహాత్మకమే అయినప్పటికీ, కక్షసాధింపు చర్యల స్థాయికి వ్యవహారాన్ని తీసుకెళ్లారనే భావన ప్రజల్లోకి వెళ్తోంది. సైఫాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేటీఆర్ సిబ్బందిని విచారిస్తున్న సమయంలో కొందరు వ్యక్తులు ప్రవేశించి గొడవ పడటానికి యత్నించారనే వార్తలు కలకలం రేపాయి. పోలీస్ స్టేషన్ లోపలే కస్టడీలో ఉన్నవారిపై దాడికి ప్రయత్నించడం విచారకరం, రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయి అని కేటీఆర్ విమర్శించడంతో బీఆర్ఎస్ దీన్ని బలమైన పొలిటికల్ డిఫెన్స్ అస్త్రంగా మార్చుకోగలిగింది.విచారణాధికారులు , శాంతిభద్రతల యంత్రాంగం వైఫల్యం అని బీఆర్ఎస్ ప్రతిదాడి చేస్తోంటే, పోలీసు శాఖ మాత్రం దాడి ఆరోపణలను ఖండించి సీసీటీవీ ఆధారాలను తెరపైకి తెచ్చింది. అయినప్పటికీ, ప్రభుత్వం తమను వేధిస్తోందని చూపించే అవకాశం బీఆర్ఎస్‌కు దొరికింది. కేవలం ఒక నిరసన ఘర్షణను రాజకీయంగా వినాశకరమైన నేరం గా చిత్రీకరించబోయి, బీఆర్ఎస్ స్థానిక శ్రేణులకు నరికొత్త కసిని, సానుభూతిని కాంగ్రెస్ నాయకత్వమే అందించినట్లయింది. ప్రతిపక్షాన్ని ఇరకాటంలో పెట్టాలనుకున్న ప్రభుత్వం, తానే సెల్ఫ్ గోల్ వేసుకుని ఆత్మరక్షణలో పడాల్సి వచ్చింది. రాజకీయాల్లో అతిగా స్పందించడం ఉద్రిక్తతలను మరింత పెంచుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసులో సిట్ విచారణలు, సీన్ రీ-కన్స్ట్రక్షన్ వంటి విజువల్స్ ద్వారా మీడియాలో మైలేజ్ సాధించవచ్చని భావించినా, అది కాస్తా వికటించి ప్రజాప్రతినిధుల సిబ్బందిని లక్ష్యంగా చేసుకున్నారనే అభిప్రాయానికి దారితీసింది. శాంతిభద్రతల నిర్వహణలో తమ బలాన్ని నిరూపించుకోవాల్సిన ప్రభుత్వం, ప్రతిపక్షాలకు మైలేజ్ ఇచ్చేలా ప్రవర్తించడం వ్యూహాత్మక లోపంగా కనిపిస్తోంది.

22ఏ భూముల వివాదాలకు పరిష్కారం.. 30 రోజుల్లో న్యాయం జరిగేలా చర్యలు

హైదరాబాద్, : తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న నిరుపేదల ఆస్తుల వివాదాలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. సీసీఎల్ఏ, న్యాయశాఖ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉ న్నతాధికారులతో హైపవర్ కమిటీ ఏర్పాటు చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీ వేదికగా ప్రకటించారు. యూఎల్సీ భూములు, ఆమోదిత లేఅవుట్లలో ప్రభుత్వ భూములు, సింగరేణి కోల్‌బెల్ట్, జీవో 59, జీవో 118, అసైన్డ్ భూములు, ఇందిరమ్మ ఇళ్లు, నాలా రుసుములు, అనధికార లేఅవుట్లు, లీజ్‌హోల్డ్ ఆస్తులు, భూదాన్ భూములు తదితర 12 అంశాలపై ప్రభుత్వం పరిష్కార చర్యలు ప్రకటించింది.తెలంగాణలో 22ఏ నిషేధిత జాబితాలో చేరిన నిరుపేదల ఆస్తుల సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది. ఈ అంశంపై బుధవారం అసెంబ్లీలో జరిగిన స్వల్పకాలిక చర్చలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక ప్రకటన చేశారు. 22ఏ నిషేధిత జాబితా వివాదాల పరిష్కారానికి సీసీఎల్ఏ ప్రత్యేక కార్యదర్శి, న్యాయశాఖ కార్యదర్శి, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఉన్నతాధికారితో హైపవర్ ఆఫీసర్స్ కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. నిరుపేదలకు సంబంధించిన న్యాయబద్ధమైన కేసుల్లో అన్యాయం జరగకుండా నిర్దిష్ట గడువుల్లో పరిష్కారం చూపుతామని తెలిపారు.భూములకు సంబంధించిన చట్టాలు, నిబంధనలు నిజాం కాలం నుంచి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు వరకు ఎలా మారాయన్న అంశాలను సీఎం రేవంత్ సభలో వివరించారు. ఈ చారిత్రక పరిణామాల నేపథ్యంలో 22ఏ కింద నిషేధిత జాబితాలో ఉన్న వివిధ రకాల భూములు, ఆస్తుల సమస్యలను ప్రభుత్వం విడివిడిగా పరిశీలించనుంది. ప్రధాన అంశాలపై చర్యలు తీసుకునే ప్రతిపాదనలను వెల్లడించిందిఅర్బన్ ల్యాండ్ సీలింగ్ (యూఎల్సీ) మిగులు భూముల విషయంలో పాక్షికంగా క్రమబద్ధీకరించిన, క్రమబద్ధీకరించని కాలనీలకు వర్తించేలా కొత్త విధానం తీసుకురానుంది. పాత పెండింగ్ దరఖాస్తులతో పాటు కొత్త దరఖాస్తులనూ ఈ విధానంలో పరిగణనలోకి తీసుకోనుంది. భూముల రిజిస్ట్రేషన్, క్రమబద్ధీకరణ ప్రక్రియలను సమాంతరంగా చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది.అధికారికంగా ఆమోదం పొందిన లేఅవుట్లలో ప్రభుత్వ భూములకు సంబంధించిన పెండింగ్ రిజిస్ట్రేషన్ దరఖాస్తుల పరిష్కారానికి వారం రోజుల్లో సమగ్ర వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. సింగరేణి కోల్‌బెల్ట్ ప్రాంతాల్లోని పెండింగ్ కేసుల పరిశీలనకు జిల్లా స్థాయి ఉన్నతాధికారుల కమిటీని ఏర్పాటు చేయనుంది.జీవో 59 కింద కన్వేయన్స్ డీడ్స్ జారీ అయిన 1,22,280 దరఖాస్తులను అర్హతల ఆధారంగా తుది పరిశీలన చేయనుంది. మరో 18,590 పెండింగ్ దరఖాస్తులను కొత్త క్రమబద్ధీకరణ విధానంలో పరిష్కరించాలని నిర్ణయించింది. జీవో 118కు సంబంధించిన పెండింగ్ కేసులను పరిష్కరించి, అర్హత సాధించిన ఆస్తులను 22ఏ జాబితా నుంచి తొలగించనుంది.అసైన్డ్ భూముల్లో నిర్మించిన ఇళ్ల విషయంలో 1977 నాటి చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని న్యాయ సమీక్ష, విస్తృత సంప్రదింపుల అనంతరం నిర్ణయం తీసుకోనుంది. ఇందిరమ్మ పథకం కింద ప్రభుత్వ స్థలాల్లో నిర్మించిన ఇళ్లు, లబ్ధిదారుల సొంత స్థలాల్లో నిర్మించిన ఇళ్లకు సంబంధించిన అంశాలపైనా ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. సొంత స్థలంలో నిర్మించిన ఇళ్లకు ఐదేళ్ల లాక్-ఇన్ గడువు పూర్తయిన తర్వాత క్రయవిక్రయాలకు అనుమతించే ప్రతిపాదనను ప్రకటించింది

గింజ గింజలో అందం..డయాబెటిస్ కూడా పరార్



ఈ విత్తనాలు చాలా పవర్ఫుల్. మీరు ఈ సీడ్స్ ను కప్పు తిన్నా చాలు. గుండె పని తీరు మెరుగుపడటానికి, ఇంకా కొలెస్ట్రాల్ కూడా ఇది తగ్గిస్తుంది. ఇంకా చర్మ సౌందర్యానికి కూడా ఇది ఎంతో హెల్ప్ చేస్తుంది. విటమిన్ ఇ, ప్రోటీన్లతో శరీరానికి కావాల్సిన పోషకాలు ఉంటాయి. ఈ విత్తనాలు చాలా పవర్ఫుల్. అవి ఏవో కాదు పొద్దుతిరుగుడు విత్తనాలు వీటిని సన్‌ఫ్లవర్ సీడ్స్ అంటారు. ఇవి గుండె ఆరోగ్యం పని తీరు మెరుగుపడటానికి, ఇంకా కొలెస్ట్రాల్ కూడా ఇది తగ్గిస్తుంది. ఇంకా చర్మ సౌందర్యానికి కూడా ఇది ఎంతో హెల్ప్ చేస్తుంది. విటమిన్ ఇ, ప్రోటీన్లతో శరీరానికి కావాల్సిన పోషకాలు ఉంటాయి. గుండె ఆరోగ్యం: ఈ గింజల్లో ఉండే ఆరోగ్యకరమైన కొవ్వులు, ఇంకా ఫైబర్ చెడు కొలెస్ట్రాల్‌ను కూడా తగ్గించి, గుండె పని తీరును మెరుగుపరుస్తాయి. ఈ రోజుల్లో హార్ట్ ఎటాక్ తో ప్రమాదంలో పడుతున్నారు. అలాంటి వాళ్ళు ఈ గింజలను తినడం అలవాటు చేసుకుంటే చాలు ఆ సమస్యల నుంచి ఉపశమనం పొందుతారు. రోగనిరోధక శక్తి: విటమిన్ ఇ, సెలీనియం వంటి యాంటీఆక్సిడెంట్లు శరీర ఇమ్యూనిటీని పెంచుతాయి. ఇంకా ఇవి జీర్ణక్రియ పని తీరును కూడా ఇది మెరుగుపరుస్తుంది. ఇంకా దీనిలో ఉండే పీచు పదార్థం జీర్ణ వ్యవస్థను కూడా సక్రమంగా పనిచేసేలా చేస్తుంది. ఇలాంటి వాళ్ళు కూడా రోజూ కప్పు తింటే చాలు. చర్మం, జుట్టు: దీనిలో విటమిన్ ఇ అందాన్ని పెంచుతుంది. ఇంకా ఈ చర్మం కూడా కాంతివంతంగా మారుతుంది. ఇంకా జుట్టు రాలడం కూడా తగ్గుతుంది. మీరు నిత్య నూతనంగా కనపడాలంటే ఇవి తింటే చాలు. ఇంకా చెప్పాలంటే ఇది షుగర్ సమస్యకు కూడా ఇది చెక్ పెడుతుంది. కాబట్టి, మీరు ఉదయం తీసుకుంటే చాలు.

నోటి పూత తగ్గడం లేదా?



నోటి పుండ్లు (నోటి పూత) చాలామందికి అప్పుడప్పుడు వస్తుంటాయి. చెంప లేదా నాలుకను అనుకోకుండా కొరుక్కోవడం, వేడి పదార్థాలు తినడం, ఒత్తిడి, ఐరన్, విటమిన్ ఃఽ12, ఫోలేట్ లోపాలు వంటి కారణాలతో ఇవి ఏర్పడవచ్చు. సాధారణంగా నోటి పూత వారం లేదా రెండు వారాల్లో వాటంతట అవే తగ్గిపోతాయి. అయితే అదే పుండు ఎక్కువకాలం కొనసాగితే మాత్రం నిర్లక్ష్యం చేయకూడదని వైద్యులు సూచిస్తున్నారు. వైద్య నిపుణుల ప్రకారం సాధారణ నోటి పుండ్లు ఒకటి నుంచి రెండు వారాల్లో తగ్గిపోతాయి. అయితే రెండు నుంచి మూడు వారాలకంటే ఎక్కువగా పుండు కొనసాగితే దాన్ని వైద్యుడు లేదా దంత వైద్యుడితో పరీక్షించించుకోవాలి. పూత పరిమాణం క్రమంగా పెరగడం, సులభంగా రక్తస్రావం కావడం, అంచులు గట్టిగా లేదా మందంగా మారడం వంటి మార్పులు కనిపిస్తే మరింత జాగ్రత్త అవసరం. ఇలాంటి లక్షణాలు ఉన్నంత మాత్రాన అది క్యాన్సర్ అని అర్థం కాదు. కానీ, కారణాన్ని తెలుసుకోవడానికి వైద్య పరీక్ష అవసరం. నోటి పూత పదేపదే ఒకే ప్రాంతంలో వస్తుంటే దానికి సాధారణ కారణం కూడా ఉండవచ్చు. పదునైన పంటి అంచు, సరిగ్గా సరిపోని డెంటల్ ఫిల్లింగ్ లేదా డెంచర్ వల్ల ఒకే ప్రాంతంలో నిరంతరం రాపిడి ఏర్పడితే పుండు మానకపోవచ్చు. అందువల్ల పుండుకు మందు రాసుకోవడం మాత్రమే కాకుండా, దానికి కారణమవుతున్న రాపిడిని గుర్తించి సరిచేయడం కూడా ముఖ్యమే. నోటి పుండుతో పాటు కొన్ని ఇతర లక్షణాలు కనిపిస్తే వైద్యుడిని సంప్రదించడం మరింత ముఖ్యం. రెండు వారాలకు మించి తగ్గని పుండు, నోటిలో నిరంతర ఎరుపు లేదా తెల్లటి మచ్చ, కారణం తెలియకుండా రక్తస్రావం, నోటిలో లేదా మెడలో గడ్డ, మింగడంలో ఇబ్బంది లేదా నొప్పి, నాలుక కదల్చడంలో ఇబ్బంది, గొంతు బొంగురుపోవడం, నోటిలో తిమ్మిరి, కారణం తెలియకుండా బరువు తగ్గడం. ఈ లక్షణాలు ఉన్నంత మాత్రాన నోటి క్యాన్సర్ ఉందని భావించాల్సిన అవసరం లేదు. అయితే అవి కొనసాగితే వైద్య పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలి.

పాప్‌కార్న్ తింటే శరీరంలో ఏం జరుగుతుంది?



ఓ పక్క ఆకలి తీరుస్తూనే మరోపక్క శరీరానికి మేలు చేసే చిరుతిళ్ల జాబితా తీస్తే..అందులో మొక్కజొన్న పాప్‌కార్న్‌దే అగ్రస్థానం. చాలా మంది దీన్ని కాలక్షేపం కోసమో, సినిమా చూస్తూ సరదాగానో నమిలేస్తుంటారు కానీ.. ఇందులో దాగి ఉన్న పోషక విలువలను మాత్రం పెద్దగా పట్టించుకోరు. గుండె ఆరోగ్యాన్ని కాపాడటం నుంచి పేగుల పనితీరును మెరుగుపరచడం దాకా పాప్‌కార్న్ అందించే వైద్యపరమైన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయి.

సినిమా థియేటర్‌కు వెళ్లినా, ఇంట్లో టీవీ చూస్తూ సేదతీరుతున్నా అందరికీ తక్కున గుర్తొచ్చే మొదటి స్నాక్ కార్న్. అయితే సరైన పద్ధతిలో తయారు చేసుకుని తింటే ఇది శరీరానికి బోలెడన్ని పోషకాలను అందించే అద్భుతమైన ఆరోగ్య సంరక్షణిగా మారుతుందని పోషకాహార నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మొక్కజొన్న గింజలతో తయారయ్యే పాప్‌కార్న్‌లో ఫైబర్, ప్రొటీన్, మెగ్నీషియం, ఫాస్ఫరస్.మక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. జీర్ణవ్యవస్థకు కొండంత అండ: ప్రముఖ వైద్య పరిశోధనా సంస్థ 'క్లీవ్‌ల్యాండ్ క్లినిక్' నివేదికల ప్రకారం.. పాప్‌కార్న్‌లో పీచు పదార్థంసమృద్ధిగా ఉంటుంది.

పెరుగు తింటే జలుబు, దగ్గు వస్తాయా?



వర్షాకాలం ప్రారంభమవగానే ఆహారం విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని నిపుణులు సూచిస్తుంటారు. ముఖ్యంగా ఈ సమయంలో పెరుగు, మజ్జిగ వంటి పాల ఉత్పత్తులను తీసుకోవడం వల్ల జలుబు, దగ్గు లేదా కఫం పెరుగుతుందని చాలామంది భావిస్తారు. దీంతో కొందరు వర్షాకాలం మొత్తం పెరుగుకు దూరంగా ఉంటారు. అయితే వర్షాకాలంలో పెరుగు తినడం వల్ల అందరికీ జలుబు, దగ్గు వస్తుందనేది నిజంకాదని నిపుణులు చెబుతున్నారు. అపోలో స్పెక్ట్రా హాస్పిటల్ క్రిటికల్ కేర్ సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ ఆశిష్ మెహ్రోత్రా ఏం చెబుతున్నారంటే.. వర్షాకాలంలో పెరుగు తినకూడదనే నియమం అందరికీ వర్తించదు. పెరుగు ఎంత తాజాగా ఉంది, ఏ ఉష్ణోగ్రతలో తీసుకుంటున్నారు, వ్యక్తి ఆరోగ్య పరిస్థితి ఎలా ఉంది వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పెరుగును ఆహారంలో చేర్చుకోవచ్చని తెలిపారు. ఫ్రిజ్ నుంచి తీసిన వెంటనే బాగా చల్లగా ఉన్న పెరుగును తినడం వల్ల కొంతమందికి గొంతులో అసౌకర్యం కలగవచ్చు. ముఖ్యంగా ఇప్పటికే సైనస్, అలర్జీ లేదా తరచుగా జలుబు వంటి సమస్యలు ఉన్నవారిలో చల్లటి ఆహార పదార్థాల వల్ల ఇబ్బంది అనిపించవచ్చు. అయితే పెరుగు నేరుగా జలుబు లేదా దగ్గుకు కారణమవుతుందని చెప్పడానికి ఆధారాలు లేవని నిపుణులు సూచిస్తున్నారు. అందువల్ల వర్షాకాలంలో పెరుగును పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని చెబుతున్నారు. అయితే వ్యక్తిగత ఆరోగ్య పరిస్థితిని బట్టి జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. పెరుగులో ప్రోబయోటిక్స్ ఉంటాయి. ఇవి శరీరానికి మేలు చేసే సజీవ బ్యాక్టీరియా. ఇవి ఆరోగ్యకరమైన జీర్ణ వ్యవస్థకు సహాయపడతాయి. జీర్ణ సమస్యలు ఉన్నవారు కూడా తమ ఆహారంలో తగిన మోతాదులో తాజా పెరుగును చేర్చుకోవచ్చని నిపుణులు చెబుతున్నారు. సమతుల్య ఆహారంలో భాగంగా పెరుగును తీసుకోవడం వల్ల జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి మేలు కలగవచ్చు. అయితే ఏ ఆహారమైనా మితంగా తీసుకోవడం ముఖ్యం. ఫ్రిజ్ నుంచి తీసిన వెంటనే పెరుగు తినకుండా కొంతసేపు బయట ఉంచి సాధారణ ఉష్ణోగ్రతకు వచ్చిన తర్వాత తీసుకోవచ్చు. ఎప్పుడూ తాజాగా ఉన్న పెరుగునే తినాలి. రంగు, వాసన లేదా రుచి మారిన పెరుగును తీసుకోకూడదు. రుచికి తగినంత వేయించిన జీలకర్ర పొడి, నల్ల మిరియాల పొడి లేదా కొద్దిగా ఉప్పు కలుపుకోవచ్చు. పెరుగులో ఎక్కువగా మసాలాలు కలపాల్సిన అవసరం లేదు. పెరుగు తిన్న ప్రతిసారీ గొంతులో మంట, కఫం లేదా ఇతర అసౌకర్యాలు ఎదురైతే దాని వినియోగాన్ని తగ్గించడం మంచిది. అలాగే సైనస్, అలర్జీ వంటి సమస్యలు తరచుగా ఎదురయ్యేవారు తమ ఆరోగ్య పరిస్థితిని బట్టి ఆహారంలో మార్పులు చేసుకోవాలి. పాలు లేదా పాల ఉత్పత్తుల పట్ల అలెర్జీ లేదా అసహనం ఉన్నవారు పెరుగు తీసుకునే ముందు వైద్యుడు లేదా పోషకాహార నిపుణుడి సలహా తీసుకోవడం మంచిది. కాబట్టి వర్షాకాలంలో పెరుగు తింటే అందరికీ జలుబు, దగ్గు వస్తాయనే అపోహను నమ్మాల్సిన అవసరం లేదు.



అక్టోబర్ 16 న 'నయీ నవేలీ'..

బాలీవుడ్ బ్యూటీ యామీ గౌతమ్ గత ఏడాది చేసిన 'హక్' విమర్శకుల నుంచి ప్రశంసలు అందుకోవడంతో పాటు పలు అవార్డులను కూడా రాబట్టింది. అదే జోష్‌తో ఆమె ఇటీవల 'ధురంధర్: ది రివెంజ్'లో కీలక పాత్రలో కనిపించి బ్లాక్ బస్టర్ హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఇక ఇప్పుడు ఆమె మరో విభిన్నమైన కథతో ప్రేక్షకులను పలకరించడానికి సిద్ధమయ్యారు. బాలాజీ మోహన్ దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న సూపర్‌న్యాచురల్ హారర్-కామెడీ చిత్రం 'నయీ నవేలీ'. ఇందులో యామీ పవర్‌ఫుల్ పాత్రలో కనిపించనున్నారు. అమెజాన్ ఓఉఓ స్టూడియోస్, కలర్ ఎల్లో సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నారు. మీరట్ నేపథ్యంలో సాగే ఈ కథలో, అల్లకల్లోలంగా ఉన్న ఒక కుటుంబంలోకి అడుగుపెట్టి అందరికీ సంతోషాన్ని పంచే పర్ఫెక్ట్ కోడలిగా యామీ కనిపిస్తారు. అయితే, ఆమె ప్రవర్తన చూసి బావకి అనుమానం వచ్చి, ఆమె ఒక చేతబడి చేసే మహిళ అని భావించడంతో అసలు కథ మొదలవుతుందని సమాచారం. ఇప్పటికే షూటింగ్ ప్రారంభం కాగా.. తాజాగా, ఈ చిత్రాన్ని దసరా పండగ కానుకగా అక్టోబర్ 16, 2026న దేశవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. కామెడీ, ఫాంటసీ, అడ్వెంచర్ మేళవించిన పాత్రలో యామీ నటన సినిమాకే హైలైట్‌గా నిలవనుందని మేకర్స్ చెబుతున్నారు. ఈ పాత్రకు యామీ గౌతమ్ మాత్రమే సరైన ఎంపిక అని నిర్మాత ఆనంద్ ఎల్ రాయ్ ప్రశంసించారు. ఈ కథకు కావాల్సిన అమాయకత్వం, కొంటెతనం రెండూ యామీలో మెండుగా ఉన్నాయని, తన పర్ఫార్మెన్స్‌తో సినిమాను నెక్స్ట్ లెవెల్‌కి తీసుకెళ్లారని అన్నారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందిస్తున్న ఈ ఫన్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌తో యామీ గౌతమ్ ఈ దసరాకి థియేటర్లలో అలరించబోతుండటం విశేషం.

కష్టసమయంలో నన్ను కాపాడింది ఆ సినిమానే..



కోలీవుడ్ దిగ్గజ దర్శకుడు శంకర్ కుమార్తెగా రంగుల ప్రపంచంలోకి అడుగుపెట్టిన అదితి శంకర్, తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును, ఫాలోయింగ్‌ను సంపాదించుకున్నారు. తెలుగు, తమిళ భాషల్లో వరుస సినిమాలు చేస్తూ ఆకట్టుకుంటున్న ఈ భామ,త్వరలోనే 'వన్స్ మోర్' చిత్రంతో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమయ్యారు. విఘ్నేష్ శ్రీకాంత్ దర్శకత్వం వహించిన ఈ రొమాంటిక్ డ్రామాలో అర్జున దాస్‌సరసన అదితి హీరోయిన్‌గా నటించగా, మిలియన్ డాలర్ స్టూడియోస్ బ్యానర్‌పై యువరాజ్ గణేశన్ నిర్మించారు. సోనా ఒలికల్ కీలక పాత్రలో కనిపించనున్న ఈ సినిమా విడుదల ఈ సందర్భంగా సినిమా ప్రమోషన్లలో పాల్గొన్న అదితి శంకర్, ఈ ప్రాజెక్ట్ తనకు దక్కిన సమయం గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. కథ వినడానికి ముందు ఈ సినిమా నిర్మాత ఎవరని అడిగి తెలుసుకున్నానని, మిలియన్ డాలర్ స్టూడియోస్ సంస్థ కథల ఎంపికలో మంచి అభిరుచి కలిగి ఉంటుంది కాబట్టి కథ వినడానికి ఆసక్తి చూపించానని తెలిపారు.

దర్శకుడు శ్రీకాంత్ కథ చెప్పడం ప్రారంభించిన కేవలం 15 నిమిషాల్లోనే ఈ సినిమా చేయడానికి ఓకే చెప్పేశానని అన్నారు. ఆ సమయంలో తనపై సోషల్ మీడియాలో విపరీతమైన ట్రోల్స్, నెగెటివిటీ వచ్చాయని, ఆ ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడటానికి ఈ సినిమా తనకు ఎంతో ఉపశమనాన్ని ఇచ్చిందని అదితి ఆవేదన వ్యక్తం చేశారు. ఇది 2 గంటల 15 నిమిషాల నిడివితో సాగే స్వచ్ఛమైన రొమాంటిక్-కామెడీ చిత్రమని, థియేటర్ల నుంచి బయటకు వచ్చేటప్పుడు ప్రేక్షకులకు ఒక మంచి అనుభూతిని ఇస్తుందని చెప్పారు.

నెల్సన్ కుకింగ్ మామూలుగా లేదుగా..!



సూపర్ స్టార్ రజనీకాంత్, డైరెక్టర్ నెల్సన్ దిలీప్ కుమార్ కాంబినేషన్‌లో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 'జైలర్-2' నుంచి తాజాగా మొదటి పాటను వదిలారు మేక ర్స్.'అలా బోలెనో' అంటూ సాగే ఈ సాం గ్ ప్రోమోను గ్రాండ్‌గా విడుదల చేశారు. ఈ చిత్రానికి సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తుం డగా.. ఈ పాటపూ అభిమానుల్లో భారీ హైప్ క్రియేట్ అయింది. ఇక ఈ పాటలో మరోవిశేషం ఏంటంటే.. ఇందులో పూర్ణ స్టెప్పులతో అలరించింది. ఇక 'జైలర్'లో 'నువ్వు కావాలయ్యా' సాంగ్‌తో ఓ ఊపు ఊపింది తమన్న. ఇప్పుడు జైలర్-2 లో 'అలా బోలెనో'తో పూర్ణ తన డ్యాన్స్‌తో ప్రోమోతోనే బజ్ క్రియేట్ చేసింది. కాగా.. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్న ఈ మూవీ అక్టోబర్ 15న ప్రపం చవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు సిద్ధం అవుతున్నది.

Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com